వార్తసంధ్య

తెలుగు దిన పత్రిక

నిజం నిర్భయంగా మీ ముందుకు...

Published From : Rangareddy VOLUME : 01 Issue : 280 Friday, 2-10-2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

Hyderabad, Mahbubnagar, Medak, Nalgonda, Nizamabad, Adilabad, Karimnagar, Warangal, Khammam, Bhadradri Kothagudem , Mahabubabad, Medchal--Malkajgiri, Yadadri Bhuvanagiri, Suryapet, Siddipet

జింబాబ్వేలో హెలికాప్టర్ కూలి ఏడుగురు మృతి



మహారాష్ట్రలో విషాదం..



ఉద్యోగులకు తీపికబురు

రెండు బకాయి డిఏలు ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం

- రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు లబ్ధి
- ప్రభుత్వంపై ఏడాదికి రూ.2,500 కోట్లు అదనపు భారం
- వాయిదాల్లో ఏరియర్స్ చెల్లింపు
- రాష్ట్రంలో కరువు పరిస్థితులపై కేబినెట్‌లో సుదీర్ఘ చర్చ
- కేబినెట్ సబ్‌కమిటీలో చర్చించాలని నిర్ణయం
- ఎల్ నినోపై అఖిలపక్షం
- సహాయక చర్యలపై అన్ని పార్టీల నుంచి సూచనలు కోరాలని నిర్ణయం
- కరువు మండలాల ప్రకటనతో పాటు తగిన సహాయం అందించాలని కేంద్రానికి అభ్యర్థన
- త్వరలో ఢిల్లీకి రాష్ట్ర మంత్రులు
- డిమాండ్ మేరకు విద్యుత్ కొనుగోలు
- ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వం తరపున పనిచేసేందుకు నలుగురు గ్రూప్-1 అధికారులు
- కేబినెట్ వివరాలను వెల్లడించిన మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్

/హైదరాబాద్:

దసరా సమీపిస్తున్న వేళ ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు రెండు డిఏలు ఇచ్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీకి సంబంధించిన అంశాలను మంత్రి పొంగులేటి సమాచార మంత్రులతో కలిసి విలేకరులకు వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ 2024 నుంచి బకాయి ఉన్న డిఏల్లో రెండు డిఏలను వెంటనే మంజూరు చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుందన్నారు. అప్పటి నుంచి బకాయి పడ్డ ఏరియర్స్‌ను వాయిదాల్లో చెల్లించాలని మంత్రి వర్గం నిర్ణయించిందన్నారు. ప్రభుత్వానికి ఆర్థికంగా భారమైనప్పటికీ ఇటీవల ఉద్యోగ సంఘాలతో జరిపిన చర్చల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులకు డిఏ, పెన్షనర్లకు డిఆర్ మంజూరు చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారని మంత్రి పొంగులేటి తెలిపారు.

-మిగతా 2 లో



శుభాష్ స్మిత్

భారత్ కీర్తి రెపరెపలు

- భారతీయ పైలట్ మచ్చర్కు ప్రశంసల వెల్లువ
- భారత్ గర్విస్తోంది: ప్రధాని మోడీ
- అసలైన హీరో: నెతన్యాహు శాల్యూట్
- రియల్ హీరో: ట్రంప్ ప్రశంసలు
- రాష్ట్రపతి ముర్ము నుంచి రాజ్నాథ్, జైశంకర్ వరకు అభినందనలు

పై దుబాయ్ విమానంలో కోపైలట్ జరిపిన దాడిలోతీవ్రంగాగాయపడినప్పటికీ ప్రయాణికుల రక్షణ కోసం తన ప్రాణాలను రిస్క్‌లో పెట్టిన భారతీయ పైలట్ స్మిత్‌పై ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తాయి. ఆయనను రియల్ హీరోగా ప్రపంచాధినేతలు అభివర్ణించారు. మెరుగైన చికిత్స కోసం స్మిత్‌ను యుఎఇకి తరలించారు.
విమానం కూల్చడానికి ఒమన్ కు చెందిన కోపైలట్ ప్రయత్నించాడంటూ వార్తలు వెలువడుతున్నాయి. అతడిని ఓ మత ఛాందసవాదిగా ఇజ్రాయెల్ అధినేత నెతన్యాహు పేర్కొన్నారు.





ఎల్నినో ప్రభావంతో ఈ ఏడాది చలి తక్కువే

- ప్రకటించిన భారత వాతావరణ కేంద్రం
- అక్టోబర్‌లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు
- చలికాలంలోనూ ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండే అవకాశం
- అక్టోబర్--డిసెంబర్‌లో తక్కువ వర్షపాతం
- తెలంగాణలో 18 శాతం లోటు వర్షపాతం
- 19 జిల్లాల్లో లోటు.. 14 జిల్లాల్లో సాధారణ వర్షపాతం
- నల్గొండ, నిర్మల్‌లో అత్యధిక వర్షపాతం లోటు
- కామారెడ్డి, జగిత్యాల, మంచిర్యాలలో అధిక వర్షపాతం
- ఎల్నినో ప్రభావం శీతాకాలంపైనా ఉంటుందన్న ఐఎండీ



దేవుళ్లపై మాట్లాడితే ప్రజల మద్దతు రాదు

- శివుడు, శ్రీరాముడిని వేరు చేసి వ్యాఖ్యలా
- ఇచ్చిన హామీలు పక్కనపెట్టి కొత్త వివాదాలు
- సీఎం రేవంత్ వ్యాఖ్యలకు కిషన్ రెడ్డి కౌంటర్


హైదరాబాద్,

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పరమేశ్వరుడు పేదల దేవుడని, శ్రీరాముడు ధనికుల దేవుడని సీఎం చేసిన వ్యాఖ్యలు మతం పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టించేలా ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి తన వ్యాఖ్యలతో ఏకంగా దేవుళ్లను కూడా రాజకీయాల్లోకి లాగారని కిషన్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. శివుడు, రాముడి పేర్లతో చేసిన ఈ వ్యాఖ్యలు యావత్

-మిగతా 2 లో


సీఈసీ రాజీనామా చేయాల్సిందే

- లేదంటే జంతర్ మంతర్ వద్ద మళ్లీ నిరసనలు
- సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే హెచ్చరిక
- నేడు ముంబైలో కాక్రోచ్ పార్టీ నిరసనకు పిలుపు
- శివాజీ పార్క్ వద్ద జైల్ భరో పేరుతో భారీ ర్యాలీ
- సిఈసి జ్ఞానేష్ కుమార్ తప్పుకోవాలని డిమాండ్



కొత్త టెక్నాలజీతో టోల్‌ప్లాజాలు..

- వాహనాలు ఆగకుండానే చెల్లింపులు
- తమిళనాడులోని పరనూర్ టోల్‌ప్లాజాలో కొత్త విధానం
- బ్యారియర్లు లేకుండానే వాహనాల రాకపోకలు
- ఫాస్టాగ్‌తో ఆటోమేటిక్‌గా టోల్ చెల్లింపు
- ఏఎన్‌పీఆర్ కెమెరాలతో వాహన నంబర్ గుర్తింపు
- ఓవర్‌హెడ్ పరికరాలతో ఫాస్టాగ్ స్కానింగ్
- వాహనాలు ఆగాల్సిన అవసరం లేకుండా ప్రయాణం
- భారీ క్యూలు, ట్రాఫిక్ సమస్యలకు చెక్
- త్వరలో దేశవ్యాప్తంగా విస్తరించే అవకాశం





అక్టోబర్ 4న తెలంగాణలో అమిత్ షా పర్యటన

- బీజేపీ ఆపరేషన్ తెలంగాణకు ప్రణాళిక
- వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా ముందుకు
- కొత్త వ్యూహాలను సిద్ధం చేస్తోన్న కమల దళం
- ఖైరతాబాద్ ఉప ఎన్నికకూ సంసిద్ధమైన బీజేపీ
- రాష్ట్రంలో కేంద్ర మంత్రుల వరుస పర్యటనలు

హైదరాబాద్,

తెలంగాణ కేంద్రంగా బీజేపీ కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా కొత్త వ్యూహాలను సిద్ధం చేస్తోంది. ఇప్పటికే పలువురు కేంద్ర మంత్రులు తెలంగాణలో వరుస పర్యటనలు చేస్తున్నారు. గ్రేటర్, ఖైరతాబాద్ ఉప ఎన్నికతో పాటుగా పంచాయితీ ఎన్నికలకు సిద్ధం అవుతున్న వేళ బీజేపీ నాయకత్వం కొత్త ప్రణాళికతో బరిలోకి దిగుతోంది. అందులో భాగంగా నేరు గా కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన ఆసక్తిగా మారుతోంది. తెలంగాణలో బీజేపీ ఈ సారి కొత్త వ్యూహాలను అమలు చేస్తోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా పావులు కదుపుతోంది.

-మిగతా 2 లో

దేవతలగుట్టను మింగేస్తున్న అక్రమ మైనింగ్?



బాంబులు పేల్చిన సందర్భంగా వెలువడిన పొగలదృశ్యం



జెసిబి లతో హెవీ వెహికిల్స్ తో గుట్టపై మట్టిని బండరాలను తొలగిస్తున్న దృశ్యం

- పేలుళ్ల శబ్దాలతో వణికిపోతున్న స్థానికులు..
- రెవెన్యూ, మైనింగ్ అధికారుల తీరుపై ప్రశ్నలు
- చారిత్రక గుట్ట ఆనవాళ్లే లేకుండా పోతాయంటున్న ప్రజలు

హైదరాబాద్, అక్టోబర్ 1 (వార్త సంధ్య):

చారిత్రక నేపథ్యం, ఆధ్యాత్మిక ప్రాధాన్యతతో గుర్తింపు పొందిన దేవతలగుట్ట నేడు అక్రమ మైనింగ్ ఆరోపణలతో ప్రమాదంలో పడిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుట్టపై జరుగుతున్నట్లు చెబుతున్న తవ్వకాలు, భారీ పేలుళ్ల కారణంగా గుట్ట స్వరూపం క్రమంగా దెబ్బతింటోందని, సమీప కాలనీల్లో నివసించే ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని వారు పేర్కొంటున్నారు. దేవతలగుట్టకు సంబంధించిన భూముల్లో ఆర్సీఐ, భూదాన్, యూఎల్సీ (అర్బన్ ల్యాండ్ సీలింగ్) పరిధిలోని భూములతో పాటు దేవతలగుట్ట దేవాలయానికి సంబంధించిన భూములు కూడా ఉన్నట్లు స్థానికుల నుంచి సమాచారం. ఆర్సీఐ ఆధీనంలోని భూముల చుట్టూ కంచె ఏర్పాటు చేసినప్పటికీ, మిగిలిన భూదాన్, యూఎల్సీ భూముల్లో అక్రమంగా మైనింగ్ జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పేలుళ్లతో కాలనీల్లో భయాందోళనలు

గుట్టపై ఉన్న బండరాళ్లను శక్తివంతమైన పేలుడు పదార్థాలతో పేల్చి

-మిగతా 4 లో



నస్థలిపురంలో ఘనంగా ప్రారంభమైన

CMR షాపింగ్ మాల్

సినీ నటి మీనాక్షి చౌదరి చేతుల మీదుగా నూతన షోరూమ్ ప్రారంభం
చీరలు, వస్త్రాలు, ఫ్యాషన్--లైఫ్‌స్టైల్ కలెక్షన్లతో ప్రత్యేక ఆకర్షణ
ప్రారంభోత్సవ కానుకగా రూ.89కే ప్రింటెడ్ క్రీప్ సారీ.. అన్ని కేటగిరీల్లో ప్రత్యేక ఆఫర్లు

హైదరాబాద్, అక్టోబర్ 1 (వార్త సంధ్య):

నాణ్యత, విస్తృతమైన కలెక్షన్లు, వినియోగదారుల సంతృప్తికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్న సిఎంఆర్ షాపింగ్ మాల్ వనస్థలిపురంలో తన నూతన షోరూమ్‌ను ఘనంగా ప్రారంభించింది. ఈ ప్రారంభోత్సవంతో వనస్థలిపురం, పరిసర ప్రాంతాల ప్రజలకు సరికొత్త షాపింగ్ అనుభూతిని అందుబాటులోకి తీసుకొచ్చింది. నూతన షోరూమ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటి మీనాక్షి చౌదరి ముఖ్య అతిథిగా హాజరై షోరూమ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో సిఎంఆర్ గ్రూప్ చైర్మన్ మావూరి వెంకట రమణ, డైరెక్టర్ మావూరి బాలాజీ పాల్గొన్నారు. అలాగే మాజీ ఎంపీ, ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్ మధు యాష్కీ గౌడ్, తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్లారెడ్డి రెడ్డి, ఎల్బీనగర్ బీజేపీ ఇన్‌చార్జ్ సామ రంగారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి,

-మిగతా 4 లో

వార్తసంధ్య
www.vaarthasandhya.com


సీఈసీ రాజీనామా చేయాల్సిందే..

-లేదంటే జంతర్ మంతర్ వద్ద మళ్లీ నిరసనలు
-సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే హెచ్చరిక
-నేడు ముంబైలో కాక్రోచ్ పార్టీ నిరసనకు పిలుపు
-శివాజీ పార్క్ వద్ద జైల్ భరో పేరుతో భారీ ర్యాలీ
-సిఈసి జ్ఞానేష్ కుమార్ తప్పుకోవాలని డిమాండ్



న్యూఢిల్లీ,
ఎన్నికల నిర్వహణ, ఎస్ఐఆర్ ప్రక్రియలో అక్రమాలకు పాల్పడటం ద్వారా అధికార బీజేపీకి ప్రయోజనం చేకూరుస్తున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తప్పుకోవాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ లు ముంబైలో నిరసనకు సిద్దమయ్యారు. రేనేడు సాయంత్రం 4 గంటలకు శివాజీ పార్క్ వద్ద జైల్ భరో పేరుతో భారీ కార్యక్రమం చేపట్టబోతున్నారు. సీఈసీని వెంటనే తప్పించి, అరెస్టు చేయాలని కాక్రోచ్ లు డిమాండ్ చేస్తున్నారు. దీంతో మహా సర్కార్ ఈ నిరసనను అడ్డుకునేందుకు సిద్దమవుతోంది. మన ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి, 3 డిమాండ్లను ముందుకు తెస్తున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ కన్వీనర్ అభిజీత్ దిప్కే వెల్లడించారు. ఇందులో మొదటిది జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి, క్రిమినల్ విచారణను ఎదుర్కోవాలి, ఆదేశాలు ఎవరు ఇచ్చారో వెల్లడించాలి. అలాగే రెండవది ఎస్ఐఆర్ ను నిలిపివేయాలి, జనవరి 2025 ఓటర్ల జాబితాను పునరుద్ధరించాలి, స్వతంత్ర విచారణకు ఆదేశించాలి. మూడో డిమాండ్ 2023 ఎన్నికల కమిషనర్ల నియామకాల చట్టాన్ని రద్దు చేసి, పౌర సమాజ భాగస్వామ్యంతో పారదర్శక చట్టాన్ని తీసుకురావాలి. వారు తమకు నచ్చిన వారిని కేవలం నిర్ణయించి ఎన్నికల కమిషనర్‌గా నియమించలేరని కేంద్రాన్ని ఉద్దేశించి అభిజీత్ దిప్కే పేర్కొన్నారు. ఈ పదవిలో ఎవరు ఉంటారనే దానిపై 150 కోట్ల మంది జీవితాలు ప్రత్యక్షంగా ప్రభావితమవుతాయన్నారు. ఎన్నికల కమిషనర్ల ఎంపిక స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా మరియు పారదర్శకంగా ఉండాలని దిప్కే కోరారు. ఎస్ఐఆర్ కు ముందే, ఓటర్ల జాబితాను 2025 ఓటర్ల జాబితాతో నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ఎస్ఐఆర్ జాబితా ప్రకారం ఎన్నికలు జరిగితే, ప్రధాని మోదీ అమెరికాలో కూడా గెలవగలరని దిప్కే ఎద్దేవా చేశారు. మరోవైపు శివాజీ పార్క్ వద్ద రేపటి కాక్రోచ్ ల ఆందోళనలకు మహారాష్ట్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. స్థానికుల ఆందోళనలను ఇందుకు సాకుగా చూపింది. దీనిపై స్పందించిన దిప్కే. తాము ఎట్టి పరిస్థితుల్లో జైల్ భరోకు దిగుతామని, చేతనైతే అడ్డుకోవాలని సవాల్ విసిరారు.

ఎల్నినో ప్రభావంతో ఈ ఏడాది చలి తక్కువే



న్యూఢిల్లీ,
వర్షాకాలం ముగిసి నేటితో శీతాకాలం ప్రారంభమైంది. ఎల్నినో ప్రభావంతో ఈ ఏడాది చలి తీవ్రత తక్కువగానే ఉంటుందని భారత వాతావరణ కేంద్రం ప్రకటించింది. అక్టోబర్ నెలలో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. అక్టోబర్ నుంచి డిసెంబర్ సీజన్లో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉందని ఐఎండీ విడుదల చేసిన శీతాకాలం బులెటిన్లో పేర్కొంది. దేశవ్యాప్తంగా అక్టోబర్ నెలలో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఎల్నినో ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది 18 శాతం లోటు వర్షపాతం నెలకొన్నట్లు తేల్చింది. 14 జిల్లాల్లో సాధారణ వర్షపాతం, 19 జిల్లాల్లో లోటు వర్షపాతం నెలకొన్నట్లు తేలింది. అత్యధిక లోటు వర్షపాతం ఉన్న జిల్లాలుగా నల్గొండ, నిర్మల్, జోగులాంబ గద్వాల, మేడ్చల్ మల్కాజ్గిరి నమోదయ్యాయి. కామారెడ్డి, జగిత్యాల, మంచిర్యాల జిల్లాల్లో సాధారణం కన్నా అత్యధిక వర్షపాతం నమోదైంది. తెలంగాణపై ప్రభావం చూపేలా ఏడు అల్పపీడనాలు ఏర్పడగా అందులో ఆరు వాయుగుండాలు, మూడు తీవ్ర వాయుగుండాలుగా మారి ఈ వర్షపాతానికి కారణమయ్యాయి. జూన్ మాసంలో అల్పపీడనాలు ఏర్పడకపోవడంతో లోటు వర్షపాతానికి దారి తీసినట్లు వాతావరణ శాఖ వివరించింది. ఈసారి భారత్లోకి నైరుతి రుతుపవనం ఆలస్యమైంది. భారత వాతావరణ శాఖ మే 26న రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకుతాయని అంచనా వేసినప్పటికీ ఆ అంచనాలన్నీ తలకిందులయ్యాయి. జూన్ 1వ తేదీన కూడా ప్రవేశించలేదు. నాలుగు రోజులు ఆలస్యంగా కేరళలోకి ప్రవేశించాయి. తెలంగాణలోకి సరైన సమయంలోనే అంటే జూన్ 8న ప్రవేశించినప్పటికీ వారం రోజుల పాటు దక్షిణ తెలంగాణ జిల్లా అయిన జోగులాంబ గద్వాల ప్రాంతంలోనే ఆగిపోయాయి. వారం రోజుల తరువాత మందకోడిగా ముందుకు కదిలి పదిహేను రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాయి. జూన్ ఒకటి నుంచి సెప్టెంబర్ 30 వరకు ఏడు అల్పపీడనాలు ఏర్పడ్డాయి. ఈ అల్పపీడనాలు ఆరు వాయుగుండాలుగా మారాయి.

దేవుళ్లపై మాట్లాడితే ప్రజల మద్దతు రాదు

(మొదటి తరువాయి)

హిందూ సమాజాన్ని అవమానించేలా ఉన్నాయని, హిందువుల మధ్య అనవసర గొడవలు పెట్టే ప్రయత్నమని అన్నారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కనపెట్టి, ఇలాంటి కొత్త వివాదాలను ముందుకు తెస్తోందని ఆరోపించారు. ప్రజలను విభజించడం కాంగ్రెస్ పార్టీకి ఎప్పటినుంచో ఉన్న అలవాటు అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి ఒక సవాల్ విసిరారు. "హిందూ దేవుళ్లపై మాట్లాడిన విధంగా ఇతర మతాల దేవుళ్ల గురించి మాట్లాడే ధైర్యం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉందా?" అని ఆయన ప్రశ్నించారు.

సెప్టెంబర్‌లోనూ యూపీఐ హవా..

(మొదటి తరువాయి)

18 శాతం వృద్ధితో రూ.29.37 లక్షల కోట్లుగా నమోదైంది. సెప్టెంబర్‌లో ప్రతిరోజూ సగటున 802 మిలియన్ల లావాదేవీలు జరుగగా వాటి విలువ సుమారు రూ.97,913 కోట్లుగా ఉంది. ఆగస్టు నెలలో నమోదైన 24.51 బిలియన్ల లావాదేవీలతో పోలిస్తే సెప్టెంబర్‌లో స్వల్ప తగ్గుదల కనిపించినా వార్షిక వృద్ధి మాత్రం బలంగా కొనసాగుతున్నది. ఇదే సమయంలో ఐఎంపీఎస్ ద్వారా జరిగిన లావాదేవీల విలువ కూడా 18 శాతం పెరిగి రూ.7.06 లక్షల కోట్లకు చేరింది. ఇదిలావుంటే రూ.2,000 దాటిన మర్చంట్ యూపీఐ లావాదేవీలపై 0.4% 'మర్చంట్ డిస్కౌంట్ రేట్ ' విధించాలన్న ప్రతిపాదనను వ్యాపారవర్గాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. కేంద్ర సర్కారు తీసుకున్న ఈ నిర్ణయం చిన్న, మధ్యతరహా వ్యాపారులపై భారం మోపుతుందని, డిజిటల్ చెల్లింపుల స్వీకరణను దెబ్బతీస్తుందని వ్యాపార వర్గాలు ఆందోళన వ్యక్తంచేశాయి. దీనికి నిరసనగా అక్టోబర్ 2న 'నో యూపీఐ డే' పాటించాలని అఖిల భారత వ్యాపారుల సమాఖ్య సహా పలు సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో చాందినీ చౌక్ ఎంపీ, సీఏఐటీ సెక్రటరీ జనరల్ ప్రవీణ్ ఖండేల్వాల్ నేతృత్వంలోని సుమారు 20 మంది సభ్యుల ప్రతినిధి బృందం ఢిల్లీలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమైంది. ఈ భేటీ తర్వాత వ్యాపార సంఘాలు తమ నిరసన పిలుపును ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించాయి. ప్రభుత్వం ఈ విషయంపై స్పష్టతనిచ్చింది. ఈ కొత్త ఛార్జీల విధానం కేవలం రూ.2,000 మించిన మర్చంట్ (పీ2పీ) లావాదేవీలకు మాత్రమే వర్తిస్తుందని తెలిపింది. దేశంలో జరిగే మొత్తం యూపీఐ మర్చంట్ లావాదేవీలలో 96 శాతానికిపైగా రూ.2,000 లోపే ఉంటున్నాయని, కాబట్టి అత్యధిక శాతం లావాదేవీలపై ఎలాంటి ప్రభావం ఉండదని వివరించింది. అంతేగాక నెలవారీగా రూ.1 లక్షవరకు యూపీఐ ద్వారా చెల్లింపులు స్వీకరించే చిన్న వ్యాపారులకు కూడా ఈ ఎండీఆర్ నుంచి మినహాయింపు ఉంటుందని స్పష్టంచేసింది.

కొత్త టెక్నాలజీతో టోల్‌ప్లాజాలు..

-వాహనాలు ఆగకుండానే చెల్లింపులు
-తమిళనాడులోని పరనూర్ టోల్‌ప్లాజాలో కొత్త విధానం
-బ్యారియర్లు లేకుండానే వాహనాల రాకపోకలు
-ఫాస్టాగ్‌తో ఆటోమేటిక్‌గా టోల్ చెల్లింపు
-ఏఎన్‌పీఆర్ కెమెరాలతో వాహన నంబర్ గుర్తింపు
-ఓవర్‌హెడ్ పరికరాలతో ఫాస్టాగ్ స్కానింగ్
-వాహనాలు ఆగాల్సిన అవసరం లేకుండా ప్రయాణం
-భారీ క్యూలు, ట్రాఫిక్ సమస్యలకు చెక్
-త్వరలో దేశవ్యాప్తంగా విస్తరించే అవకాశం




ఎంత ఫాస్టాగ్ వాడుతున్నా టోల్ ప్లాజాల దగ్గర కొన్ని క్షణాలపాటైనా ఆగాల్సిందే. టోల్‌ప్లాజాల దగ్గర చెల్లింపుల సమయంలో వాహనాలు ఆగేందుకు బ్యారియర్లు ఉంటాయి. అయితే, తమిళనాడులో అసలు వాహనాలు ఆగాల్సిన అవసరం లేకుండానే చెల్లింపులు చేయవచ్చు. టోల్‌ప్లాజా దగ్గర బ్యారియర్లు కూడా తీసేశారు. ఇది తమిళనాడులోని పరనూర్ టోల్‌ప్లాజా వద్ద అమలవుతున్న కొత్త టెక్నాలజీ వ్యవస్థ. నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) ఈ వ్యవస్థను ఏర్పాటు చేసిందితమిళనాడులోని తాంబరం-టిండివనం పట్టణాల మధ్య గల పరనూర్ వద్ద 45వ నెంబర్ జాతీయ రహదారిపై ఉన్న టోల్‌ప్లాజాలో ఈ విధానం అమలవుతోంది. ఇది 46.5 కిలోమీటర్ల పొడవు కలిగిన రహదారి. అక్టోబర్ 1, గురువారం నుంచి ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఇక్కడి టోల్‌ప్లాజాను మల్టీ లేన్ ఫ్రీ ఫ్లో (ఎంఎల్ఎఫ్ఎఫ్) కింద అభివృద్ధి చేయడంతో ఈ టోల్‌ప్లాజా దగ్గర వాహనాలు ఆగకుండా నేరుగా వెళ్లిపోవచ్చు. అయితే, ఇదే మొదటి బ్యారియర్ ఫ్రీ టోల్‌ప్లాజా కాదు. ఇంతకుముందు ముంబై నేషనల్ హైవే 48పై, సూరత్-భరూచ్ మధ్య కామ్రేజ్-చోర్యాసి మధ్య ఉన్న టోల్‌ప్లాజాలో గత మే నుంచే ఈ విధానం అమలవుతోంది. త్వరలోనే దేశవ్యాప్తంగా ఇతర టోల్‌ప్లాజాలకు కూడా ఈ విధానాన్ని అమలు చేయనున్నారు. వాహనాలన్నీ ఫాస్టాగ్‌తో లింకై ఉంటాయన్న సంగతి తెలిసిందే. అయితే, ఈ ఫాస్టాగ్‌ను రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ టెక్నాలజీతో అనుసంధానం చేశారు. ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ఏఎన్‌పీఆర్) కెమెరాలు ఇందులో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ టెక్నాలజీ ద్వారా ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్.. ఫాస్టాగ్‌ను గుర్తిస్తుంది. అలాగే, కెమెరాలు వాహన రిజిస్ట్రేషన్ నెంబర్‌ను గుర్తిస్తాయి. ఈ ఫాస్టాగ్, వాహన నెంబర్ ఆధారంగా ఆటోమేటిగ్గా చెల్లింపు జరిగిపోతుంది. దీంతో వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోవచ్చు. అయితే, ఫాస్టాగ్‌లో తగినంత బ్యాలెన్స్ ఉండటం తప్పనిసరి. టోల్‌ప్లాజాల దగ్గర వాహనాల భారీ క్యూలైన్లు, నెమ్మదిగా కదిలే పరిస్థితిని తగ్గించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ ఈ విధానాన్ని ప్రవేశపెడుతోంది.

ఉద్యోగులకు తీపికబురు

(మొదటి తరువాయి)

ఈ రెండు డిఏల వల్ల ప్రతి ఏడాది రాష్ట్ర ప్రభుత్వంపై రూ.2,500 కోట్ల భారం పడుతుంది. దాదాపు ఎల్‌నినో పరిస్థితులపై కేబినెట్ లో సుదీర్ఘ చర్చ జరిగిందని మంత్రి పొంగులేటి తెలిపారు. రాష్ట్రంలో ఈ వానాకాలంలో దాదాపు 17 శాతం వర్షపాతం లోటు ఉందని, నిన్నటితో రుతుపవనాల కాలం కూడా ముగిసిందని మంత్రి పొంగులేటి తెలిపారు. దాదాపు 235 మండలాల్లో తీవ్ర వర్షాభావంతో కరువు పరిస్థితులు నెలకొన్నాయని కరువు ప్రాంతాల్లో తక్షణమే చేపట్టాల్సిన చర్యలపై కేబినెట్ సబ్ కమిటీలో చర్చించాలని నిర్ణయం తీసుకున్నట్లుగా మంత్రి పొంగులేటి తెలిపారు. త్వరలోనే అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లుగా మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. రైతు సంఘాలతో పాటు వివిధ రంగాల నిపుణులతో భేటీలు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. రాష్ట్రంలో ఉన్న ఎల్ నినో పరిస్థితులు చేపట్టాల్సిన ఉపశమన చర్యలపై సలహాలు, సూచనలు స్వీకరిస్తారని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. కరువు ప్రాంతాల ప్రకటనతో పాటు తగిన సాయం అందించాలని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర మంత్రివర్గం విజ్ఞప్తి చేసిందని మంత్రి పొంగులేటి తెలిపారు. త్వరలోనే మంత్రుల బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్ర పరిస్థితిని నివేదిస్తారని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలని మంత్రివర్గం నిర్ణయించిందని మంత్రి పొంగులేటి తెలిపారు. త్వరలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ సీజన్‌లో దాదాపు 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని సివిల్ సప్లైస్ విభాగం అంచనా వేసిందని ఆయన తెలిపారు. కొనుగోళ్ల ప్రక్రియ సాఫీగా జరిగేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని మంత్రివర్గం అధికారులకు సూచించిందన్నారు.
డిమాండ్ మేరకు విద్యుత్‌ను కొనుగోలు ఎల్ నినో పరిస్థితులతో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని మంత్రి పొంగులేటి తెలిపారు. రాష్ట్రంలో సాధారణంగా ఒక్క రోజుకు 15,000 మెగావాట్ల విద్యుత్ వినియోగం ఉండగా ఈ సీజన్‌లో అది రికార్డు స్థాయిలో 19,892 మెగావాట్ల పీక్ డిమాండ్‌కు చేరిందని దాదాపుగా 20 వేల మెగావాట్లకు చేరిందని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. గతేడాది మొత్తంలో 16,613 మెగావాట్ల గరిష్ట వినియోగం నమోదయ్యిందని అందుకే విద్యుత్ డిమాండ్ కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి, తగినంత విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని మంత్రి పొంగులేటి తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ కోత లేకుండా సరఫరా చేసేందుకు అవసరమైనంత విద్యుత్‌ను సమకూర్చుకోవాలని, డిమాండ్ మేరకు విద్యుత్‌ను కొనుగోలు చేయాలని నిర్ణయించిందని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. భవిష్యత్ డిమాండ్, అవసరాలను దృష్టిలో పెట్టుకొని కొత్తగా పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి, విద్యుత్తు సమీకరణపై దృష్టి పెట్టాలని నిర్ణయించిందని మంత్రి పొంగులేటి తెలిపారు. దాదాపు 7,800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా యూనిట్లు నెలకొల్పేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని, ఇందులో 3,000 మెగావాట్ల సోలార్ విద్యుత్, 4000 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్, 800 మెగావాట్ల పవన విద్యుత్ యూనిట్ల ఏర్పాటు ప్రతిపాదనలపై మంత్రివర్గం చర్చించిందని మంత్రి పొంగులేటి తెలిపారు. కేంద్ర నిబంధనల మేరకు బిడ్డింగ్ విధానంలో ఈ ప్రాజెక్టులు చేపట్టాలని నిర్ణయించిందని మంత్రి పొంగులేటి తెలిపారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడలో వరల్డ్ క్లాస్ ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుందని మంత్రి పొంగులేటి తెలిపారు. పూర్తిగా ప్రభుత్వ నిధులతోనే ఈ మార్కెట్ ఏర్పాటు చేయాలని మంత్రివర్గం సూచించిందన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పునః సమీక్షించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. ఇప్పటికే ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఈపిసి విధానంలో చేపట్టిన ప్రాజెక్టులు అసంపూర్తిగా ఉంటే రద్దు చేయాలని అధికారులను కేబినెట్ ఆదేశించిందన్నారు. ఇందులో భాగంగా 10 ఈపిసి సాగునీటి ప్రాజెక్టులను నిలిపివేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని మంత్రి పొంగులేటి తెలిపారు. తెలంగాణలో డిజిటల్ మీడియా అడ్వర్టైజింగ్ కు ప్రత్యేక పాలసీ అమలు చేసే ప్రతిపాదనను మంత్రివర్గం పరిశీలించిందని మంత్రి పొంగులేటి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ రూపొందించిన డిజిటల్ అడ్వర్టైజ్‌మెంట్ పాలసీకి అనుగుణంగా రాష్ట్రంలో ఈ పాలసీకి మంత్రివర్గం ఆమోదం తెలిపందన్నారు. న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ పోస్టు మంజూరుకు కేబినెట్ ఆమోదం తెలిపిందని, మరో నలుగురు గ్రూప్ 1 అధికారులను కూడా ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున పని చేసేందుకు నియమించాలని నిర్ణయం తీసుకుంది.

శభాష్ స్మిత్



న్యూఢిల్లీ,
దుబాయ్ నుండి ఫ్లై అల్జీరియా బయలుదేరిన ఫ్లై దుబాయ్ విమానంలో తలెత్తిన అత్యంత ప్రమాదకర దుర్ఘటనలో ప్రయాణికుల ప్రాణాలను కాపాడేందుకు అసాధారణ ధైర్యం ప్రదర్శించిన భారతీయ కెప్టెన్ స్మిత్ మచ్చర్ ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలందుకుంటున్నారు. తీవ్రంగా గాయపడినప్పటికీ తన ప్రాణాల కంటే విమానంలోని వారి భద్రతకే ప్రాధాన్యం ఇచ్చిన ఆయనను భారత ప్రధాని నరేంద్ర మోడీ, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సహా పలువురు ప్రపంచ నాయకులు "హీరో"గా అభివర్ణించారు. విమానంలో జరిగిన ఘటనపై దర్యాప్తు కొనసాగుతుండటంతో దాడి వెనుక చేతులపై ఇంకా అధికారిక స్పష్టత వెలువడలేదు.
'భారత్ గర్విస్తోంది'.. మోడీ
ప్రధాని నరేంద్ర మోడీ స్మిత్ను ప్రత్యేకంగా ప్రశంసించారు. అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో, తీవ్రంగా గాయపడినప్పటికీ ఆందోళన చెందకుండా ప్రయాణికులను కాపాడేందుకు అత్యున్నత ప్రొఫెషనలిజంను ప్రదర్శించారని కొనియాడారు. "స్మిత్ ధైర్యం వందల మంది ప్రాణాలను కాపాడటంతో పాటు భారీ విపత్తును నివారించింది" అని పేర్కొన్నారు. "కెప్టెన్ స్మిత్ మచ్చర్ ఒక హీరో, భారత్ ఆయనను చూసి గర్విస్తోంది" అని పేర్కొన్నారు. స్మిత్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన భార్య, తల్లిదండ్రులతోనూ ప్రధాని మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలోనూ మోడీ ఈ ఘటనను ప్రస్తావించారు. ఒక భారతీయుడు అత్యంత భారీ ఆకాశ విపత్తును నివారించడంలో కీలక పాత్ర పోషించాడని పేర్కొన్నారు.
నెతన్యాహు సెల్యూట్
ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్మిత్ను "నిజమైన హీరో"గా అభివర్ణించారు. తీవ్రంగా గాయపడినప్పటికీ ఆయన ప్రశాంతంగా కాక్పిట్ తలుపు తెరవడం వల్ల ప్రయాణికులు, సిబ్బంది జోక్యం చేసుకోవడానికి అవకాశం లభించిందని పేర్కొన్నారు. ఆయన చర్య భారీ ఆకాశ విపత్తును నివారించిందని ప్రశంసించారు. స్మిత్ త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇజ్రాయెల్ సామాజిక మాధ్యమాల్లో అతడి పేరు మారుమోగుతోంది. స్మిత్ మచ్చర్.. అతనొక నిజమైన హీరో... అంటూ వేలాది మంది కృతజ్ఞతలు తెలిపారు. భారతీయ పైలట్ చిత్రాలను పంచుకుంటూ ఆయన ధైర్యాన్ని కొనియాడారు.
వాషింగ్టన్ నుంచి ట్రంప్ ప్రశంస
స్మిత్ సాహసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దృష్టిని ఆకర్షించింది. వైట్హౌస్లో విలేకరులతో మాట్లాడిన ట్రంప్ స్మిత్ను "హీరో"గా అభివర్ణించారు. తీవ్రంగా గాయపడిన స్థితిలోనూ కాక్పిట్ తలుపు తెరిచి సహాయం కోరగిన ఆయన సమయస్ఫూర్తిని ప్రశంసించారు. ఘటనకు సంబంధించిన వివరాలను నెతన్యాహు తదితరుల నుంచి తెలుసుకున్నానని చెప్పారు. దీంతో స్మిత్ సాహసాన్ని ప్రశంసించిన ప్రపంచ నాయకుల జాబితాలో భారత ప్రధాని మోడీ, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో పాటు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా చేరారు.
'దేశం గర్విస్తోంది'.. రాష్ట్రపతి ముర్ము
రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా స్మిత్ ధైర్యాన్ని ప్రశంసించారు. ఆయన అసాధారణ సాహసం, సమయస్ఫూర్తి దేశ ప్రజలను కదిలించాయని, దేశం ఆయనను చూసి గర్విస్తోందని పేర్కొన్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ స్మిత్ను "అసాధారణ హీరో"గా అభివర్ణించారు. తీవ్ర గాయాల మధ్య ఆయన తీసుకున్న నిర్ణయాత్మక చర్యలను ప్రశంసించారు. లోక్సభ స్పీకర్ ఓం బిర్లా కూడా ఆయనను నిజమైన హీరోగా కొనియాడారు.

మా ఆస్తులు.. మీ ఆస్తులు.. విచారణకు సిద్ధమా

(మొదటి తరువాయి)

ప్రారంభించానని చెప్పారు. ప్రస్తుతం మూడు హోటళ్లు ఉన్నాయని తెలిపారు. తన ఆస్తుల వివరాలను ఎన్నికల అఫిడవిట్లలో వెల్లడించానని పేర్కొన్నారు. సిరిసిల్లలో చేనేత కార్మికుల సమస్యలను సీఎం పట్టించుకోలేదని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆత్మహత్య చేసుకున్న 35 మంది చేనేత కార్మికుల కుటుంబాలకు కనీసం రూ.10 లక్షల పరిహారం ప్రకటిస్తారని ఆశించామని చెప్పారు. అయితే సీఎం తన పర్యటనలో రాజకీయ విమర్శలకే పరిమితమయ్యారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నిస్తున్నందుకే తమ కుటుంబంపై ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే ప్రభుత్వం ఇలాంటి రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. ఇక హామీలు అమలు చేసే వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. మరోవైపు రేవంత్ రెడ్డికి ఒక గొప్ప చరిత్ర ఉంది.. ఆయన ఏ పార్టీలో కాలు పెడితే ఆ పార్టీ మటాష్ అయితదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జోస్యం చెప్పారు. ఆర్మూర్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి తెలంగాణలో తెలుగుదేశంను బొందపెట్టి పోయిండు.. తెలంగాణలో తెలుగు దేశంను మొత్తం ఆ పార్టీనే లేకుండా చేసి అడుగు నాశనం చేసి పోయిండు. అక్కడికెళ్లి ఇయ్యాళ్ల కాంగ్రెస్‌లకు వచ్చిండు. దీన్ని కూడా కచ్చితంగా మళ్లీ ఒక 25-30 ఏండ్లు ఎవడూ ఓటేయకుండా చేసే పోతడు. కాంగ్రెస్ మరిపించి.. మొత్తం నాశనం చేసే పోతడన్నారు కేటీఆర్ . నేతన్నకు బీమా అనే పథకం పెట్టినం. ఎవరన్నా నేత కార్మికుడు చనిపోతే రూ.6 లక్షలు రైతు బీమాలాగే పెట్టినం. మేమంతా కలిసి చేసినం. దాని గురించి ఏమైనా చెప్తడేమో చూసినం. ఆగిపోయింది మళ్లీ షురూ చేస్తా అని చెప్తడేమో అనుకున్నం.. దాని గురించి మాట లేదని కేటీఆర్ అన్నారు. బతుకమ్మ చీరలు బంద్ అయినయ్. అవి మళ్లీ అక్కడ పెడ్తడేమో చెప్తడేమో అనుకున్నం. దాని గురించి ముచ్చట లేదు. అక్కడ నీళ్లిచ్చే పథకం బంద్ అయింది.. దాని గురించి ఏమైనా చెప్తడేమో అనుకున్నం. ఏం లేదు.. మళ్లీ గదే పుక్కిటి పురాణం. ఇక్కడ చేసిన కథలే అక్కడ కూడా చేయడం. ఈ పాటి అందానికి అక్కడికి పోయి మీటింగ్ పెట్టాల్నా అని చురకలంటించారు.

అక్టోబర్ 4న తెలంగాణలో అమిత్ షా పర్యటన

(మొదటి తరువాయి)

గ్రేటర్ ఎన్నికల్లో సత్తా చాటేందుకు బీజేపీ అగ్రనాయకత్వం ఇప్పటికే పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేసింది. ఈ క్రమంలోనే కేంద్ర హోంమంత్రి అమిత్ షా అక్టోబర్ 4న తెలంగాణలో పర్యటించనున్నారు. అమిత్ షా పర్యటన కేవలం అధికారిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటుగా భవిష్యత్ వ్యూహాలకు కీలకంగా మారుతోంది. కాంగ్రెస్ - బీఆర్ఎస్ లక్ష్యంగా అమిత్ షా తెలంగాణలో పార్టీ నేతలకు ఇప్పటికే దిశా నిర్దేశం చేసారు. కేంద్ర మంత్రులు తరచూ తెలంగాణలో పర్యటిస్తూ... ప్రత్యేకంగా తటస్థులతో మమేకం కావాలని పార్టీ ఆదేశించింది. కాగా, తెలంగాణలో పార్టీ కార్యాచరణ పైన ఢిల్లీలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, రాష్ట్ర నాయకత్వానికి ఇప్పటికే దిశానిర్దేశం చేశారు. తెలంగాణలో ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ప్రజా వ్యతిరేకతను అనుకూలంగా మలుచుకోవడానికి "సడక్ సే సదన్ తక్" కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే అమిత్ షా పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పర్యటనలో అమిత్ షా కరీంనగర్, మెదక్ జిల్లాలలో పర్యటించనున్నారు. కరీంనగర్‌లోని ప్రతిమ కాలేజ్ లో జరిగే కార్యక్రమంలో ఆయన పాల్గొనున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడమే ప్రధాన లక్ష్యంగా అమిత్ షా పర్యటన సాగనుందని పార్టీ నేతలు చెబుతున్నారు. అమిత్ షా పర్యటన ద్వారా పార్టీ క్యాడర్‌లో జోష్ నింపాలని, ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లోకి గట్టిగా తీసుకెళ్లాలని వ్యూహం సిద్దం చేస్తున్నారు.

వార్తసంధ్య
www.vaarthasandhya.com

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

సింగరేణి మండలంలోని అర్హత కలిగిన పట్టభద్రులందరూ ఫారం-

-18 ద్వారా తమ ఓటు నమోదు చేసుకోవాలి



సింగరేణి ప్రతినిధి , అక్టోబర్ 1 (వార్త సంధ్య):
వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సింగరేణి మండలంలోని అర్హత కలిగిన పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా మైనార్టీ నాయకులు షేక్ గౌసుద్దీన్ పిలుపునిచ్చారు. ప్రతి పట్టభద్రుడు తన ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయవచ్చన్నారు. "మీ ఓటు.. మీ భవిష్యత్తు" అని పేర్కొంటూ, అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఫారం--18 ద్వారా ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. విద్యావంతుల భాగస్వామ్యం సమాజ పురోగతికి, ప్రజాస్వామ్య బలోపేతానికి ఎంతో అవసరమని షేక్ గౌసుద్దీన్ తెలిపారు.

బోర్‌వెల్ రీఛార్జ్ పనులతో భూగర్భ జలాల పెంపు

వర్షపు నీటిని భూమిలోకి మళ్లించాలి.. నీటి సంరక్షణకు ప్రాధాన్యం

ఎంపీడీఓ పద్మ, సర్పంచ్ బానోత్ హీరాలాల్



సింగరేణి ప్రతినిధి, అక్టోబర్ 1 (వార్త సంధ్య):
వీబీజీ రామ్‌జీ కార్యక్రమం ద్వారా భాగ్యనగర్ తండాలో చేపడుతున్న బోర్‌వెల్ రీఛార్జ్ స్ట్రక్చర్ పనులను సింగరేణి మండల ఎంపీడీఓ పద్మ పరిశీలించారు. పనుల పురోగతిని పరిశీలించి, సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రీఛార్జ్ పనులను నాణ్యతా ప్రమాణాలతో సకాలంలో పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పద్మ మాట్లాడుతూ.. వర్షపు నీరు వృథాగా వెళ్లకుండా బోర్‌వెల్ రీఛార్జ్ స్ట్రక్చర్ల ద్వారా భూమిలోకి మళ్లించడం వల్ల భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. భవిష్యత్‌లో నీటి నిల్వలు పెరగడంతో గ్రామాల్లో నీటి కొరతను అధిగమించేందుకు ఈ పనులు దోహదపడతాయని పేర్కొన్నారు. వీబీజీ రామ్‌జీ కార్యక్రమం కింద చేపడుతున్న పనులను సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. భూగర్భ జలాల పరిరక్షణకు గ్రామ ప్రజలు కూడా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ తండా సర్పంచ్ బానోత్ హీరాలాల్, ఈసీ సుధీర్, పంచాయతీ కార్యదర్శి అనిల్ కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ రాంబాబు, వార్డు సభ్యుడు గాంధీ, ఫీల్డ్ అసిస్టెంట్ ఉమామహేశ్వరరావు, గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ వద్దిరాజు ఆధ్వర్యాన కేటీఆర్ ను కలిసిన ఉన్నికృష్ణన్ నంబూద్రి తదితర ప్రముఖులు



హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) అక్టోబర్ 1. :
కలాడి శ్రీ ఆదిశంకరాచార్య మడొమ్ ఆధ్వర్యాన సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ సమీపాన ఉన్న బైసన్ పోలో మైదానంలో డిసెంబర్ 12వతేదీ శనివారం "అద్వైత సంగమం"జరుగుతుంది.ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఆధ్వర్యాన శ్రీ ఆదిశంకరాచార్య మడొమ్ ఛైర్మన్ రితీష్ రాజ్, ఉన్నికృష్ణన్ నంబూద్రి,సందీప్ నల్లారి,కూసం శ్రీనివాస్,దుర్గారాజు తదితరులు గురువారం తెలంగాణ భవన్ లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావును కలిసి ఆహ్వానించారు.అద్వైత సంగమంలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని,ఆ రోజు ఉదయం గణపతి హోమంతో మొదలై శంకర-శాస్తపూజ,భజన,కోటి కుంకుమార్చన,అతిథితులకు సన్మానం, సాయంత్రం మంగళహారతితో కార్యక్రమం ముగుస్తుందని నంబూద్రి తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం నాదే

-స్వతంత్ర అభ్యర్థిగా బరిలో పాలకూరి అశోక్



హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) అక్టోబర్ 1. : గురువారం నాడు సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఖమ్మం వరంగల్ నల్లగొండ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలుస్తున్నట్టు ప్రకటించారు గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో 30 వేలుమొదటి ప్రాధాన్యత ఓటు 90 వేల రెండో ప్రాధాన్య ఓటు సాధించి బిఆర్ఎస్ ఓడిపోవడం తానే కారణమయ్యారని ప్రధాన పార్టీలకు ముచ్చ మాటలు పట్టించానని అన్నారు 90 శాతం పైగా ఎస్సీ ఎస్టీ బీసీలను కాదని కాంగ్రెస్ పార్టీ రెండు ఎమ్మెల్సీ స్థానాలను రెడ్డి సామాజిక వర్గం కేటాయించి తెలంగాణ బీసీ రెడ్డి కాంగ్రెస్ గా మారిందని అన్నారు టిఆర్ఎస్ సైతం ఓసిలకే టికెట్ కేటాయించడానికి ప్రయత్నం చేస్తుందని అయితే జరిగితే ఆ రెండు పార్టీలు బీసీలు 100 శాతం బొంద పెట్టడం ఖాయమని అన్నారు ఓట్లు మావి సీట్లు బీవా అని ప్రశ్నించారు రెండు పార్టీలు హైబ్రిడ్ మొక్కలను తెర మీదికి తెస్తున్నాయని జన సంబంధం లేని వారు తెలంగాణ అస్తిత్వం తెలియని వారు డబ్బుల సంచులతో పోటీ చేయాలని చూస్తున్నారు అన్నారు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ లో 42శాతం స్థానికులు బీసీలకు కేటాయిస్తామని హామీ ఇచ్చి అసెంబ్లీ కోర్టులో నాటకాలు లాడి బీసీలు నిండా ముంచిందని ఇప్పుడు బీసీలను సీట్లు కేటాయించడానికి అవకాశం ఉన్న ఎందుకు ఇవ్వడం లేదని ఆయన ప్రశ్నించారు 10శాతం కూడా లేని ఓసిలు 70 శాతంఅసెంబ్లీ నీ కబ్జా పెట్టారని అన్నారు గత 15 ఏళ్లుగా నిరుద్యోగుల కోసం తెలంగాణ సమాజం కోసం పనిచేశానని అంటూ టిఆర్ఎస్ అటు కాంగ్రెస్ రెండు పార్టీలు 18 కేసులు పెట్టి ఎన్ని ఇబ్బందులు గురిచేసిన నిరుద్యోగ నిరుద్యోగుల పక్షమే తప్ప ఈ ప్రభుత్వానికి అంట కాగా లేదని ప్రాణాలు పణంగా పెట్టి మూడుసార్లు అమర నిరాహారదీక్ష చేశానని లక్షల మంది చూస్తారు ఆన్లైన్ లో పాటలు ద్వారా ఉచితంగా పాటలు బోధించాలని అన్నారు నిరుద్యోగుల పక్షం నుండి రోడ్డుపై నిలబడి పోలీసుల దిగ్బంధాలు చేదించుకుంటూ నిత్యం కోట్లు మెట్లు ఎక్కుతూ నిలబడి గొంతు ఎత్తానని నిరుద్యోగులు బీసీలు ఎస్సీ ఎస్టీ మైనార్టీలకు అండగా నిలబడతారని అన్నారు లక్షల ఉద్యోగాలు ఇస్తామని కేవలం 13 వేల ఉద్యోగాలు ఇచ్చి 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని అబద్ధాలు చెబుతున్నారని నిరుద్యోగులు నిండా ముంచిన పార్టీ కాంగ్రెస్ అని విమర్శించారు రెండు గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఉద్యోగులు కాంగ్రెస్ పార్టీని పాతంలోకి తొక్కుతారని విమర్శించారు రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నాన్ లోకల్ కబ్జాలో ఉందని పరిశ్రమలు ఐటీ సెక్టర్ పెట్టుబడులు ఉద్యోగాలు 80 శాతం ఇప్పటికే ఆంధ్ర గుప్పిట్లో ఉన్నాయని వాపోయారు శివసేన స్ఫూర్తి నాన్ లోకల్ గో బ్యాక్ అంటూ నినాదంతో ఉద్యమం చేపట్టబోతున్నట్లు ప్రకటించారు తెలంగాణ బిడ్డలకు ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగుల కల్పనా తన ఎన్నికల్లో నినాదం అని ప్రకటించారు గ్రూప్ వన్ గ్రూప్ టూ గ్రూప్ త్రీ ఉద్యోగాల ప్రకటన ఇచ్చిన తర్వాత ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు పవర్ సెక్టర్ లో 53 00 ఉద్యోగాలతో ఆర్థిక శాఖ ఆమోదం పొందిన తర్వాత ఇంతవరకు నోటిఫికేషన్ ఇవ్వలేదని అన్నారు 25 వేల ఉద్యోగాలతో మెగా డీఎస్ ని ఉద్యోగ క్యాలెండర్ ప్రకటించిన ఇప్పటివరకు దిక్కు లేదన్నారు సర్కార్బడిని బాగు చేస్తామని రేవంత్ రెడ్డి ఒక దంపుడు ఉపన్యాసాలు తప్ప ఏమీ లేదన్నారు 33 జిల్లాల్లో సిల్క్ డెవలప్మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసి నిరుద్యోగులను ఉద్యోగుల మార్చాలని డిమాండ్ చేశారు ఉద్యోగులకు పిఆర్సి లేదు ఆరు డీఏలు పెండింగ్లో పెట్టారని అవుట్సోర్సింగ్ ఉద్యోగులు జీతాలు పెంచక ప్రభుత్వంలోని పెద్దలు రక్తం తాగుతున్నారని విమర్శించారు పేరుకే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని తెలంగాణ ఆస్తిత్వం ఆంధ్ర గుప్పిట్లో పెట్టారని భౌగోళిక తెలంగాణ తప్ప సామాజిక తెలంగాణ సాధ్యం కాలేదని తెలంగాణ ఉన్నత కులాల చేతిలో బంది అయిందని ఎస్సీ ఎస్టీ బీసీ వర్గాల్లో చైతన్యం ఓడు రూపంలో వచ్చినప్పుడే సాధ్యమవుతుందని అన్నారు బీసీలందరూ ఐక్యమైనప్పుడే మనం న్యాయం జరుగుతుంది ఇంకా ఈ ఊడిగం ఇంకా ఎన్నాళ్లు అని ఆయన ప్రశ్నించారు మేమెంతో మాకు అంత నిబంధన నినాదంతో చేతులు బిగించాల్సిన అవసరం ఉందన్నారు బడ్జెట్లో విద్యకు 18 శాతం కేటాయించాలని వైద్య విద్య పూర్తిగా ఉచితంగా అందినప్పుడే సామాజిక తెలంగాణ సాధ్యమని ఆయన చెప్పారు ఈ సమావేశంలో నిరుద్యోగులు జానయ్య గౌడ్ నవీన్ రెడ్డి సాగర్ కివి గౌడ్ ప్రణీత్ అశోకు సార్ కు సంపూర్ణ మద్దతిస్తున్నట్లు వారు ప్రకటించారు సంతోష్ సార్ గెలుపు కోసం కృషి చేయాలని వారు కోరారు

కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ నూతన కమిటీ నియామక పత్రాల అందజేత



వార్త సంధ్య కూకట్‌పల్లి :
మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్‌మెంట్‌లో కూకట్‌పల్లి నియోజకవర్గానికి సంబంధించి నూతనంగా నియమితులైన పలువురు నాయకులకు ఈరోజు నియామక పత్రాలను అందజేశారు. కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయమైన శ్రీ హేమ దుర్గా భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ చేతుల మీదుగా నూతన బాధ్యులకు పత్రాలు ప్రదానం చేశారు.
నూతనంగా నియమితులైన
జిల్లా జనరల్ సెక్రెటరీలు: వి. యాదగిరి, టి. రాజు
జిల్లా సెక్రెటరీ: ఏ. రాజు
కూకట్‌పల్లి వైస్ చైర్మన్: వి. బాబ్జి
కూకట్‌పల్లి నియోజకవర్గ కన్వీనర్: ఎం. అనిల్ కిషోర్
కూకట్‌పల్లి ప్రెసిడెంట్: బి. రవి
డివిజన్/ప్రాంతీయ ప్రెసిడెంట్లు:
బాలాజీనగర్: ఎం. రవి
కేపీహెచ్‌బీ: పి. శామ్యూల్
కైతలాపూర్: ఎన్. నిఖిల్
మూసాపేట్: కె. నర్సింగ్ రావు
ఫతేనగర్: సిహెచ్. నరేష్
ప్రకాష్‌నగర్: జే. చంద్రశేఖర్
అల్లాపూర్: పి. సురేష్
హస్మత్‌పేట్: ఎం.ఎస్. అరవింద్ కుమార్
ఓల్డ్ బోయిన్‌పల్లి: పి. సురేష్
ఈ సందర్భంగా బండి రమేష్ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, ఎస్సీ వర్గాల సంక్షేమానికి మరియు పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నిర్వహించే అన్ని కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఎస్సీ డిపార్ట్‌మెంట్ ప్రతినిధులు మరియు కార్యకర్తలు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

కామారెడ్డి పట్టణం లో తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండా ఆవిష్కరణ



కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వార్త సంధ్య) అక్టోబర్ 1
కామారెడ్డి: తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండా పండుగ సందర్భంగా కామారెడ్డిలో పార్టీ జెండాను ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్లమెంటు ఇన్‌చార్జ్ వేణు మాధవ్ హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జెండా పండుగ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. పార్టీ కార్యకలాపాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జ్ నంగునూరి రవీందర్ గుప్తా, షేక్ సన, ఏసు, మాజీ సర్పంచ్ పెరుమాండ్ల రాములు, దేవేందర్ గౌడ్, రాజు, దోమకొండ దుంపటి రాకేష్, రణధీర్ తదితరులు పాల్గొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తల భారీ హాజరుతో జెండా పండుగ కార్యక్రమం ఘనంగా జరిగింది

,ఎంపీ వద్దిరాజు మనుమరాలు తారిణి పుట్టినరోజు సందర్భంగా సత్తుపల్లిలో మాధురి మధు ఆధ్వర్యాన అన్నప్రసాద వితరణ





హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) అక్టోబర్ 1 :
బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర మనుమరాలు తారిణి పుట్టినరోజు సందర్భంగా ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో ప్రముఖ వ్యాపారవేత్త,మున్నూరుకాపు సంఘం పట్టణ అధ్యక్షుడు మానుకోట మాధురి మధు-మంగతాయారు దంపతులు అన్నప్రసాదం వితరణ గావించారు.వద్దిరాజు రవిచంద్ర-విజయలక్ష్మీ దంపతుల కుమారుడు నిఖిల్ చంద్ర-అనీల దంపతుల చిన్న కూతురు తారిణి పుట్టినరోజు సందర్భంగా మధు-మంగతాయారు దంపతులు గురువారం ఉదయం సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రి వద్ద రోగులు,వారి సహాయకులకు అల్పాహారం అందజేశారు.ఆ తర్వాత మధ్యాహ్నం సాయిబాబా ఆలయంలో సుమారు 500 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ గావించి తారిణికి తమ ఆశీస్సులు అందజేశారు.

జేఎన్‌టీయూహెచ్ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి

-ఎస్ఎఫ్ఐ డిమాండ్

వార్త సంధ్య కూకట్‌పల్లి :



జేఎన్‌టీయూహెచ్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ హైదరాబాద్‌లోని బాలుర, బాలికల హాస్టళ్లలో నెలకొన్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం ఆధ్వర్యంలో గురువారం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.వి. నరసింహ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు సుజయ్ దార్ల, దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ... హాస్టళ్లలో తాగునీటి ఫిల్టర్లు సరిగా పనిచేయకపోవడం వల్ల అపరిశుభ్రమైన నీరు సరఫరా అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కారిడార్లు, బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్లు సక్రమంగా నిర్వహించకపోవడం, కొన్ని టాయిలెట్లు అసలు పనిచేయకపోవడం, తగినంత నీటి సరఫరా లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పారిశుద్ధ్య లోపం వల్ల విద్యార్థుల ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. అంతేకాకుండా, కొన్ని గదుల్లో పరిమితికి మించి అధిక సంఖ్యలో విద్యార్థులను కేటాయించడం, స్టడీ హాళ్లలో కుర్చీలు, టేబుళ్లు, సరైన లైటింగ్ వంటి ప్రాథమిక సౌకర్యాలు లేకపోవడంపై అభ్యంతరం తెలిపారు. హాస్టల్ భోజనం నాణ్యతపై కూడా విద్యార్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయాన్ని ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు వెంటనే అన్ని హాస్టళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను గుర్తించాలని, విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీరు, నాణ్యమైన ఆహారం, మెరుగైన వసతి, మరుగుదొడ్ల నిర్వహణ, క్రమమైన నీటి సరఫరాతో పాటు స్టడీ హాల్ సౌకర్యాలను తక్షణమే పునరుద్ధరించాలని స్థానిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు హేమంత్ సిద్ధార్థ, రాజు కుమార్, వసంత్ నాయక్, అక్షిత్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వార్తసంధ్య
www.vaarthasandhya.com

న్యాయవాదుల సంక్షేమం కోసం కృషి చేస్తా



/మెట్ పల్లి అక్టోబర్ 1 (వార్త సంధ్య):
మెట్ పల్లి కోర్టు కాంప్లెక్స్ కి అవసరం అయిన అదనపు స్థలం కోసం తన శాయ శక్తు ల కృషి చేస్తానని కోరుట్ల ఎ మ్మెల్యే డా. కల్వకుంట్ల సం జయ్ కుమార్ అన్నారు. బా ర్ అసోసియేషన్ సభ్యుల విన్నపం మేరకు ఆయన గు రువారం కోర్టుకి అనుకుని ఉన్న ఎస్సారెస్పి భూమిని పరిశీలించారు. ప్రస్తుతం ఖా ళీగా ఉన్న రెస్సారెస్పి భూ మి కోర్టు కాంప్లెక్స్ కి అను కూలంగా ఉన్నందున ఇట్టి భూమిని ఇరిగేషన్ శాఖ నుండి బదిలీ చేయడానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మరియు అధికారులతో కల సి మాట్లాడతానని హామీ ఇ చ్చారు. అనంతరం బార్ అ సోసియేషన్ గదిలో మాట్లా డుతూ, న్యాయవాదుల సం క్షేమం కోసం అవసరం అ యిన ప్రభుత్వ సహాయం కో సం కృషి చేస్తానని అన్నా రు.అనంతరం ఎమ్మెల్యేని బార్ అసోసియేషన్ అధ్య క్షులు మరియు న్యాయవా దులు శాలువా కప్పి స న్మానించారు. ఈ కార్యక్ర మం లో ప్రధాన కార్యదర్శి నల్ల రాజేందర్, ఉపాధ్యక్షు రాలు యం. సుమలత, న్యాయవాదులు మగ్గిడి వెంకట నర్సయ్య, గంద్ర ప్ర వీన్ రావ్, కట్టా నర్సాగౌడ్, పుప్పాల లింబాద్రి, ఎలా ముల రాంబాబు, ఒజ్జెల శ్రీ నివాస్, బక్కూరి రమేష్, కా జీపేట ప్రవంతి, ఆకుల ప్రవీ ణ్, ఆకుల మానస, మోర పు చిరంజీవి, కడారి యుగం దర్, లోకిని సుమిత్, సామ అనిరుద్, వంగ వేణు, అంగ డి పురుషోత్తం,రజిత ఉ న్నారు.

జాతీయ వయోవృద్ధుల దినోత్సవ

రామగిరి, అక్టోబర్ 1 (వార్త సంధ్య):



గురువారం జాతీయ వయోవృద్ధుల దినోత్సవ సందర్భంగా పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో వయోవృద్ధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త సాహితీగత్త నూనె రాజేశం కవి రచయిత సోషల్ వర్కర్ సీనియర్ సిటిజన్ ఆర్గనైజింగ్ సభ్యుడు రాజేశం చేసిన సేవలను గుర్తించి చేస్తున్న సేవలను పరిగణలోకి తీసుకొని రాజేశం ను,అలాగే సేవలందించిన వృద్ధులను శాలువాతో సత్కరించి మేమోంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో డిసిపి రాంరెడ్డి,జిల్లా జడ్జ్ శ్రీనిజ,జిల్లా మెడికల్ ఆఫీసర్ పవిత్ర,రిటైర్డ్ డిపిఆర్ఓ వీర బుచ్చయ్య,పిటి స్వామి,సూపర్డెంట్ కొట్టే రాజయ్య,ఫీల్డ్ ఆఫీసర్ సుమలత తదితరులు పాల్గొన్నారు.

మంత్రి జూపల్లి కృష్ణా రావును ఘెరావ్ చేసిన నిరుద్యోగ కళాకారులు



హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య)అక్టోబర్. 1 :
రవీంద్ర భారతి లోమంత్రి ఆఫీస్ ముందు జూపల్లికృష్ణారావు అడ్డుకున్న నిరుద్యోగకళాకారులు. నిన్న రవీంద్ర భారతి ముట్టడికి పిలుపు నిచ్చిన కళాకారులు రెండో రోజు రవీంద్ర భారతీ లో మంత్రి ఆఫీస్ ఆందోళన కు దిగిన కళాకారులు అర్హులైన కళాకారులకు తెలంగాణ సాంస్కృతిక సారథి లో ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు 1000 ఉద్యోగాలు కల్పించాలని మంత్రి జూపల్లి కృష్ణారావుకువిజ్ఞప్తి చేసిన నిరుద్యోగ కళాకారులు మంత్రి బయటకు వెళ్లకుండా ఆందోళన చేసిన కళాకారులు మంత్రి కళ్ళపై పడి వేడుకున్న కనుకరించని రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు కళారులను నెట్టుకుంటూ వెళ్లిన మంత్రి జూపల్లి కృష్ణారావు మంత్రి వాహనాన్ని అడ్డుకున్న కళాకారులు ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం రాష్ట్ర చైర్మన్ ఏ వెంకటేశం, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నకరికంటి కిరణ్ కుమార్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గజ్జెల్లి ప్రతాప్, జవాజి ప్రవీణ్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పేరాల యాదగిరి కొండ్ర కుమార్ మట్టెడ కవిత రాష్ట్ర కోశాధికారి ఎండి సలీం బానోతు నర్మద దెబ్బలత పరకాల రమ కలవేణి రాణి కొండగూరు రాజు మోత రమేష్ పాల్నాటి రాజు గిలకత్తుల రమేష్ గౌడ్ పిన్నింటి దాసు పిలుట్ల ఉమాపతి డోంగ్రి సతీష్ గజవెల్లి రాజశేఖర్ పందిరి సైదులు తదితరులు పాల్గొన్నారు

దేవతలగుట్టను మింగేస్తున్న అక్రమ మైనింగ్?

(మొదటి తరువాయి)





తవ్వకాలు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిత్యం వినిపిస్తున్న పేలుళ్ల శబ్దాలు, వాటి ప్రకంపనలతో సమీప కాలనీల్లో నివసించే ప్రజలు ఆందోళన చెందుతున్నారని చెబుతున్నారు. పేలుళ్ల తీవ్రత కారణంగా ఇళ్ల పునాదులపై ఒత్తిడి ఏర్పడి, కొన్ని ఇళ్లకు బీటలు ఏర్పడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారికంగా నిర్వహించిన సాంకేతిక పరిశీలన లేదా ధృవీకరణ వివరాలు ప్రజలకు అందుబాటులో లేవు. ఈ వ్యవహారంపై శ్రీ సాయి బాలాజీ హోమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తరఫున మీర్‌పేట్, బాలాపూర్ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేసినట్లు సమాచారం. ఫిర్యాదులపై తగిన స్పందన కనిపించకపోవడంతోనే పేలుళ్లు కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

చారిత్రక, సహజ సంపదకు ముప్పు?

దేవతలగుట్టపై సహజసిద్ధంగా ఏర్పడిన జలగుండంలో ఏడాది పొడవునా నీరు ఉండటం ప్రత్యేకతగా స్థానికులు చెబుతున్నారు. గుట్ట పరిసరాల్లో అనేక ఔషధ మొక్కలు ఉండేవని, ఒకప్పుడు పచ్చని వృక్షాలతో ఆహ్లాదకర వాతావరణం ఉండేదని వారు గుర్తుచేస్తున్నారు. 1677లో ఛత్రపతి శివాజీ మహారాజు శ్రీశైలం మల్లికార్జునుడిని దర్శించుకునేందుకు హైదరాబాద్ మీదుగా ప్రయాణించిన సమయంలో దేవతలగుట్టను సందర్శించారని చారిత్రక ఆధారాలు ఉన్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఈ అంశానికి సంబంధించి అధికారిక చారిత్రక ఆధారాలను సంబంధిత శాఖలు ధృవీకరించాల్సి ఉంది. ఇలాంటి చారిత్రక, సహజ ప్రాధాన్యత కలిగిన ప్రాంతంలో భారీ స్థాయిలో తవ్వకాలు, పేలుళ్లు జరుగుతున్నాయన్న ఆరోపణలు నిజమైతే గుట్ట ఉనికికే ముప్పు ఏర్పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి మాటున గుట్ట స్వరూపం మారుతోందా?

ఇప్పటికే గుట్ట వెనుక భాగంలో విల్లాలు, కాలనీలు, వెంచర్లు ఏర్పడుతున్న నేపథ్యంలో అక్కడ జరుగుతున్న నిర్మాణాలకు అవసరమైన అనుమతులు, పర్యావరణ నిబంధనలు పాటిస్తున్నారా అనే అంశాలపై కూడా స్థానికులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.

ఒకప్పుడు పచ్చదనంతో కళకళలాడిన ప్రాంతం ప్రస్తుతం పేలుళ్లు, తవ్వకాల కారణంగా బండరాళ్లు, మట్టి దిబ్బలతో కనిపిస్తోందని స్థానికులు చెబుతున్నారు. అక్రమ మైనింగ్ కొనసాగితే మరికొద్ది కాలంలో దేవతలగుట్ట అసలు స్వరూపం పూర్తిగా మారిపోయే ప్రమాదం ఉందని వారు ఆందోళన చెందుతున్నారు.

ఇప్పటికైనా రెవెన్యూ, మైనింగ్, పోలీసు, సంబంధిత పర్యావరణ శాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలన చేపట్టి గుట్టపై జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న తవ్వకాలు, పేలుళ్లపై సమగ్ర విచారణ జరపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. తవ్వకాలకు అనుమతులు ఉన్నాయా? పేలుడు పదార్థాల వినియోగానికి నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకున్నారా? భూదాన్, యూఎల్సీ తదితర భూముల స్థితి ఏమిటి? నిర్మాణాలు, వెంచర్లకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? అనే అంశాలను అధికారులు స్పష్టం చేయాలని వారు కోరుతున్నారు.

దేవతలగుట్ట చారిత్రక ప్రాధాన్యత, పర్యావరణ విలువలను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

నస్థలిపురంలో ఘనంగా ప్రారంభమైన CMR షాపింగ్ మాల్

(మొదటి తరువాయి)



మెంబర్ సి. ఈశ్వరమ్మ యాదవ్, షోరూమ్ యజమాని పి. కృష్ణ యాదవ్, సురేష్ యాదవ్ తదితరులు హాజరయ్యారు.

మీనాక్షి చౌదరి సందడి

ప్రారంభోత్సవ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మీనాక్షి చౌదరి మాట్లాడుతూ, సిఎంఆర్ షాపింగ్ మాల్‌లోని చీరల కలెక్షన్లు తనకు ఎంతో నచ్చాయని తెలిపారు. తాను కూడా క్రమం తప్పకుండా సిఎంఆర్‌లో షాపింగ్ చేస్తుంటానని పేర్కొన్నారు. విభిన్నమైన చీరల డిజైన్లు, కలెక్షన్లు తనను ఆకట్టుకున్నాయని చెప్పారు. వేదికపై ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన మీనాక్షి చౌదరి.. వనస్థలిపురం ప్రజలకు తనపై ఎంతో అభిమానం ఉందని, అదే విధంగా తనకూ ఇక్కడి ప్రజలంటే ఎంతో ఇష్టమని పేర్కొన్నారు. అనంతరం వేదికపైనే పాటలకు నృత్యం చేస్తూ ప్రేక్షకులను అలరించారు. దీంతో ప్రారంభోత్సవ వేడుక మరింత ఉత్సాహభరితంగా సాగింది.

అన్ని వయసుల వారికి విస్తృత కలెక్షన్లు

నూతనంగా ప్రారంభమైన సిఎంఆర్ షాపింగ్ మాల్‌లో చీరలు, సంప్రదాయ దుస్తులు, పురుషులు, మహిళలు, చిన్నారుల వస్త్రాలతో పాటు వివిధ రకాల ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ కలెక్షన్లు అందుబాటులో ఉంచారు. అన్ని వయసుల వారికి, కుటుంబ సభ్యులందరికీ ఒకే చోట విస్తృతమైన షాపింగ్ సౌకర్యం లభించేలా షోరూమ్‌ను రూపొందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రారంభోత్సవంలో తొలి కొనుగోలుదారుగా పి. కృష్ణ యాదవ్ నిలిచారు.

వినియోగదారుల సంతృప్తే లక్ష్యం

ఈ సందర్భంగా సిఎంఆర్ షాపింగ్ మాల్ చైర్మన్ మావూరి వెంకట రమణ మాట్లాడుతూ, వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను అందించడంతో పాటు ప్రతి షాపింగ్‌ను ఒక మధురమైన అనుభూతిగా మార్చడమే తమ లక్ష్యమని తెలిపారు. వినియోగదారుల ఆదరణతో మరిన్ని ప్రాంతాలకు తమ సేవలను విస్తరిస్తూ ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కానుకగా ప్రింటెడ్ క్రీప్ సారీని రూ. 89కే అందిస్తున్నామని, అలాగే వివిధ కేటగిరీల్లో మరెన్నో ప్రత్యేక ఆఫర్లు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు.

వనస్థలిపురంలో ప్రారంభమైన సిఎంఆర్ షాపింగ్ మాల్ స్థానిక ప్రజలకు సరికొత్త షాపింగ్ గమ్యస్థానంగా నిలవనుందని యాజమాన్యం పేర్కొంది. వనస్థలిపురం, పరిసర ప్రాంతాల ప్రజలు నూతన షోరూమ్‌ను సందర్శించి, విస్తృతమైన కలెక్షన్లను ఆస్వాదించాలని సిఎంఆర్ యాజమాన్యం ఆహ్వానించింది.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో సర్పంచ్‌కు సమాచారం కరువు!

-ఆర్డీవోకు ఫిర్యాదు.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వినతి..



చండూరు, అక్టోబర్ 1 (వార్త సంధ్య):
నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గం చండూరు మండలం గుండ్రపల్లి గ్రామపంచాయతీ పరిధిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సర్పంచ్, ఉపసర్పంచ్, పాలకవర్గ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా నిర్వహించడంపై వివాదం నెలకొంది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామ సర్పంచ్ ఉజ్జిని ఉష అనిల్ రావు గురువారం చండూరు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు.గ్రామంలో ప్రభుత్వ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక రాజకీయ నాయకులు, రేషన్ డీలర్‌తో కలిసి అధికారులు నిర్వహించారని, అయితే తనతో పాటు ఉపసర్పంచ్, పాలకవర్గ సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని సర్పంచ్ ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శికి సైతం ఈ కార్యక్రమం గురించి తెలియదని తెలిపారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు రాజకీయాలకు అతీతంగా పారదర్శకంగా అమలు చేయాలని, స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం పాటించాలని సర్పంచ్ కోరారు. కార్యక్రమానికి సంబంధించి అధికారిక ఉత్తర్వులు, మార్గదర్శకాలను పరిశీలించి, నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే సంబంధిత జీపీఓ, అధికారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో ప్రభుత్వ కార్యక్రమాలను గ్రామపంచాయతీతో సమన్వయం చేసుకుంటూ నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయాలని, విచారణ వివరాలను లిఖితపూర్వకంగా అందించాలని ఆర్డీవోను కోరారు. తక్షణమే స్పందించిన చండూరు ఆర్డీవో వందనపు శ్రీదేవి జిపిఓ కు మెమో జారీ చేయాలని తాసిల్దార్ కు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో చండూరు బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బొమ్మరబోయిన వెంకన్న, గుండ్రపల్లి సర్పంచ్ ఉజ్జిని ఉష, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎత్తపు మధుసూదన్ రావు,బిఆర్ఎస్ చండూరు మండల ఉపాధ్యక్షులు కూరపాటి సుదర్శన్, అధికార ప్రతినిధి బొడ్డు సతీష్ గౌడ్, చండూరు మండలం యువజన అధ్యక్షులు ఉజ్జిని అనిల్ రావు,చండూరు మాజీ కౌన్సిలర్ అనపర్తి శేఖర్, పడమటితాళ్ల సర్పంచ్ గాలెంక రాంబాబు, గుండ్రపల్లి ఉపసర్పంచ్ టేకుల వినోద్ రెడ్డి, వార్డు మెంబర్లు పెండ్యాల నిర్మల్ రావు, తీగల వెంకన్న, వడ్డమల్ల మధు, కాశమల్ల శ్రీనివాసరావు కాశమల్ల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వార్తసంధ్య
www.vaarthasandhya.com

సంపాదకీయం

కౌలు రైతుకు రక్షణ కరవు



భారతదేశం వ్యవసాయిక దేశం అనడంలో ఎటువంటి సందేశానికి ఆస్కారం లేదు. భారత ప్రభుత్వ వ్యవసాయిక శాఖ 2024 -25 నివేదిక ప్రకారం మొత్తం నికర సాగు భూమి 35 కోట్ల ఎకరాలకు పైగా ఉంది. పచ్చికబయల్లు, తోటలు, సాగుకి అనుకూలమైన భూములు కలుపుకుంటే 44.1 కోట్ల ఎకరాల సాగు భూమి ఉంది. దేశం మొత్తం భూమిలో ఇది 59%గా ఉంది. ఫ్యూడల్ వ్యవస్థనుంచి నేటి అర్ధభూస్వామ్య వ్యవస్థ వరకు కౌలుదారీ విధానం కొనసాగుతున్నది. అనధికారిక అంచనాల, ప్రపంచ బ్యాంకు, జాతీయ నమూనా సర్వే సంస్థల గణాంకాల ప్రకారం 2.13 కోట్లకుపైగా కౌలు రైతుల కుటుంబాలు ఉన్నాయి. ఇది ఖచ్చితమైన లెక్కగా భావించలేము. ఎందుకంటే 92% పైగా కౌలు ఒప్పందాలు నోటి మాటగానే ఉన్నాయి. అలాంటి వారికి కౌలు రైతులుగా గుర్తింపు ఉండదు. వారు రైతుల లెక్కల్లోకి రారు. అందువల్ల వాస్తవ పరిశీలనలో కౌలు రైతుల సంఖ్య కోట్ల కొద్ది పెరుగుతుంది. కౌలు రైతులు సాగు చేసే వాస్తవ భూమి 8.5 కోట్ల ఎకరాలు ఉంటుందని ఆర్థిక సంస్థల, స్వచ్ఛంద సంస్థల అధ్యయనాల అంచనాగా ఉంది. దేశం లోని కౌలు రైతుల్లో 36% మందికి సొంత భూమి సెంట్ కూడా లేదు. దేశవ్యాప్తంగా సగటు కౌలు భూమి 25% దాకా ఉన్నప్పటికీ, నిర్దిష్ట వ్యవసాయ ఆధారిత రాష్ట్రాల్లో కౌలు భూమి చాలా ఎక్కువగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రొఫెసర్ రాధాకృష్ణ కమిషన్, కౌలు రైతుల సంఘాల నివేదిక ప్రకారం రాష్ట్రంలో వాస్తవంగా 32 లక్షల మంది కౌలు రైతులు ఉన్నారు. సాగు భూమిలో 60% నుండి 70% కౌలు భూమిగా ఉంది. కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాల్లో 80% కౌలు రైతులే ఉన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్రలో 50% పైగా కౌలు రైతులు ఉన్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతాల్లో కూడా కౌలు రైతుల సంఖ్య వేగంగా పెరుగుతున్నది. ఎపి రాష్ట్రంలోని కౌలు రైతుల్లో పదిలక్షల మందికి సెంటు సొంత భూమి లేదు. తెలంగాణ రాష్ట్రంలో వాస్తవ సాగు భూమిలో 35% భూమిని, మొత్తం రైతుల్లో 36% ఉన్న కౌలు రైతులే సాగు చేస్తున్నారు. ప్రతి ముగ్గురులో ఒకరు కౌలు రైతుగా ఉన్నాడు. పంజాబ్ రాష్ట్రం వ్యవసాయ పరంగా అభివృద్ధి చెందినా, అక్కడ దేశంలోనే అత్యధికంగా 73% కుటుంబాలకు సొంత భూమి లేదు. సుమారు 25% వ్యవసాయ కుటుంబాలు కౌలు రైతులుగా ఉన్నట్లు జాతీయ నమూనా సర్వే, వివిధ అధ్యయనాల గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 25% భూమి కౌలు ఒప్పందాల కిందనే సేద్యం సాగుతున్నది. బీహార్‌లో మొత్తం రైతుల్లో సుమారు 40% దాకా కౌలు రైతులు ఉన్నారని వివిధ వ్యవసాయ నివేదికలు, ఆర్థిక అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. వ్యవసాయ కుటుంబాల్లో 91%పైగా చిన్న, సన్నకారు రైతులే ఉన్నారు. వీరిలో ఎక్కువ మందికి సొంత భూమి లేకపోవడం వల్ల కౌలుదారులుగా ఇతరుల భూములు సాగు చేస్తున్నారు. సుమారు 23% భూమి కౌలు రూపంలో సేద్యం జరుగుతున్నది. ఇక్కడ కూడా నోటి మాట కౌలు విధానం అమలు జరుగుతున్నది. వివిధ రాష్ట్రాల్లో ఉన్న కౌలుదారీ చట్టాలు అలంకారప్రాయంగా ఉన్నాయి. భూకామందుల ప్రయోజనాలు కాపాడుతున్నాయి. రాత పూర్వక ఒప్పందం ఉంటేనే కౌలుదారుగా గుర్తింపు ఉంటుంది. రాత పూర్వక కౌలు ఒప్పందం లేకపోవడం వల్ల కౌలు రైతులకు ఎలాంటి చట్టపరమైన హక్కులు లేవు. భూకామందు దయ మీద కౌలు భూమి ఆధారపడి ఉంది. ఆంధ్రప్రదేశ్ లోతెచ్చిన పంట సాగుదార్ల హక్కుల చట్టంలో భూయజమాని అనుమతి సంతకం ఉంటేనే కౌలు రైతుకు ప్రభుత్వం గుర్తింపు కార్డు ఇస్తుంది. భూ యజమానులు అలా సంతకం పెట్టటానికి అంగీకరించకపోవడంవల్ల కౌలురైతుగా గుర్తింపు లేక పంటరుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీలు, పంట నష్ట పరిహారాలు పొందలేకపోతున్నారు. రాష్ట్రంలో 87% మంది రైతులకు కౌలు గుర్తింపు కార్డులు ప్రభుత్వం ఇవ్వలేదు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ గణనీయంగా కౌలు రైతులు ఉండటానికి కారణం వారి సొంత భూమి లేకపోవడమే. భూ కేంద్రీకరణ పెరగడమే. దేశ వ్యవసాయ భూమిలో దాదాపు 44% భూమి కేవలం 10% అత్యంత ధనిక భూకామందు కుటుంబాల వద్ద ఉంది. వీరిలో కూడా 5% కుటుంబాల వద్ద 32% భూమి ఉంటే, 1% కుటుంబాలు ఏకంగా 10% భూమిని తమ ఆధీనంలో ఉంచుకున్నారు. బీహార్‌లోని కొన్ని గ్రామాల్లో ఒక పెద్ద భూస్వామి కుటుంబం గ్రామం మొత్తం భూమిలో 20% కలిగి ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన భూ సంస్కరణల చట్టాలు భూ కేంద్రీకరణను బద్దలు చేసి పేదలకు భూ పంపిణీ చేయడంలో పూర్తిగా విఫలం అయ్యాయి. పాలకులు చేసిన భూ సంస్కరణల చట్టాలన్నీ భూస్వామ్య వర్గానికి నష్టం లేకుండా చేసిన కావటమే అందుకు కారణంగా ఉంది. దేశంలోను, తెలుగు రాష్ట్రాల్లోను ప్రధానంగా రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు సాగునీరు, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం, మార్కెట్ సౌకర్యం లేకపోవడం, గిట్టుబాటు ధరలు రాక పోవడం. ఈ సమస్యలకు కారణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే. పై సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యాయి. సేద్యపు ఖర్చులు పెరుగుతున్న, అందుకు అనుగుణంగా పంటలకు ధరలు లభించకపోవడం వల్ల, ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు ముఖ్యంగా కౌలు రైతుల బాగా నష్టపోయి అప్పుల పాలై, తీర్చేమార్గం లేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. దేశంలో 1995 2023 మధ్య అధికారిక నివేదికల విశ్లేషణల ప్రకారం 4,05,000 పైగా రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. వీరిలో కౌలు రైతులే ఎక్కువగా ఉన్నారు. ఇటీవల నమోదైన రైతుల మరణాల్లో 56% కంటే ఎక్కువ మంది వ్యవసాయ కూలీలే (కౌలు రైతులు) ఉన్నారు. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, రైతు స్వారాజ్య వేదిక వంటి సంస్థలు తెలుగు రాష్ట్రాల్లో ఆత్మహత్యలు చేసుకున్న రైతుల్లో 75% నుండి 80% దాకా కౌలు రైతులే ఉన్నారని తెలిపాయి. కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం విప్లవాత్మక భూ సంస్కరణల ద్వారా కౌలు రైతుల తోసహా గ్రామీణ పేదలందరికీ భూ పంపిణీ జరగాలి. కౌలు రైతులకు పూర్తి రక్షణ ఉండాలి. గ్రామీణ ప్రజల అభివృద్ధికి, దేశాభివృద్ధికి ఆటంకంగా ఉన్న అర్ధఫ్యూడల్ సంబంధాలను, భూ కేంద్రీకరణను బద్దలుకొట్టాలి. ఈ పని నేటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయవు. గ్రామీణ ప్రజలే సమష్టిగా ఉద్యమించి సాధించుకోవాలి.

శివ కేశవా.. ఏందీ పిచ్చి రాజకీయం!



మీకు తెలుసా? భక్తికి కూడా ఆస్తి పరిమితులు ఉంటాయట. దేవుళ్లలో ధనికులు, పేదలు ఉంటారట. ఇకపై మీరు పూజించే దేవుడిని బట్టి మీ ఆదాయ వర్గీకరణ ఈజీగా
చేయవచ్చు. రెవెన్యూ డిపార్ట్‌మెంట్ వాళ్లకు ఆదాయ ధృవీకరణ సర్టిఫికెట్ ఇవ్వడం చాలా తేలికైపోతుంది. మీరు రాముడిని పూజించారనుకోండి.. మీరు డబ్బున్నోళ్ల కింద లెక్క.
శివుడిని పూజించారనుకోండి.. అటోమేటిక్‌గా ఈడబ్ల్యూఎస్ కోటాలోకి వచ్చేస్తారన్నమాట. ఈ మాట అంటున్నది ఎవరో కాదు... ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. రాముడు డబ్బున్నోళ్ల దేవుడంట. శివుడు పేదల దేవుడంట. రాముడు ఉత్తరాది దేవుడంట, శివుడు దక్షిణాది దేవుడంట.. దేవుళ్లకు సంబంధించి ఇదేం విభజననో అర్థం కాదు.రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత స్వయంగా నెత్తిన ముత్యాల తలంబ్రాలు పెట్టుకుని వెళ్లి, సాష్టాంగ ప్రణామం చేసి సమర్పణ చేసుకున్న దేవుడు ఎవరు? రాముడే కదా..! గోదావరి తీరంలో ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ.. ఉన్న సీతారాములకు ఆలయం కట్టడానికి డబ్బులు ఇచ్చిన వాళ్లు అంతా ఎవరు? ఆ గోదావరి తీరంలో ఉండే పేద ప్రజలు కాదా? భద్రాచలం ఏజెన్సీలో ఇప్పటికీ ఉండే ప్రజలు ఎవరు? అక్కడ రామస్వామిని కనుక్కొన్న దమ్మక్క కోయ మహిళ. అక్కడ ఉండే ప్రజల్లో అత్యధికులు కోయలు, కొండ్రెడ్డులు, బంజారాలు.. వాళ్లందరూ కలిసి నిర్మించుకున్న దేవాలయం అది. స్థానిక గిరిజన సంప్రదాయాలతో ముడిపడిన దేవుడు భద్రాచల రాముడు.
అలాంటి రామచంద్రుడు ధనికుల దేవుడు ఎలా అవుతాడు? ఆ ఆలయాన్ని నిర్మించినందుకు పన్నెండేండ్లు చెరసాలలో మగ్గి సర్వస్వం ధారపోసిన భక్త రామదాసు త్యాగం ఇప్పుడు ఏమైపోయినట్టు? భద్రాద్రి కోదండరాముడి అస్తిత్వం, రామదాసు కీర్తనల వైభవం ఏమైపోయినట్టు? ఇప్పుడు ఆలయ అభివృద్ధికోసం అంటూ ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చుపెడుతున్నామని చెప్తున్నారే.. దేనికోసం పెడుతున్నట్టు? ముఖ్యమంత్రి ఇవన్నీ మర్చిపోయినట్టున్నారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో ఎన్ని రామాలయాలు ఉన్నాయో ఒకసారి దేవాదాయ శాఖను అడిగి తెలుసుకుంటే మంచిది. కుతుబ్ షాహీ రాజు తానీషా స్వయంగా స్థాపించిన తలంబ్రాల సమర్పణ సంప్రదాయాన్ని ఇవాళ్టికీ ప్రభుత్వాలు నేటికీ పాటిస్తున్నాయంటే.. దానికి కారణం భద్రాద్రి రాముడు తెలంగాణ సాంస్కృతిక జీవన వైభవానికి నిలువెత్తు ప్రతీక. అక్కడి స్థానిక కథనమే చెప్తున్నదేందంటే.. రాములవారి పర్ణశాలే ఇక్కడ ఉన్నదని.
ఇక్కడి గోదావరి తీరంలోనే సీతారాములు పదేండ్లకు పైగా జీవించారని, ఇక్కడే సీతాపహరణం జరిగిందని.. ఇంత గొప్పగా సీతారాముల వనవాస కథనాలతో అనుసంధానం అయిన గొప్ప క్షేత్ర సంస్కృతిని దెబ్బ తీసేవిధంగా రాముడిని ఉత్తరాది వాడంటూ చిన్న చేయడం అంటే ఇక్కడి ప్రజల ఆత్మగౌరవాన్ని చిన్నచేయడమే అవుతుంది.
తెలంగాణలో శివకేశవ ఆలయాలు లేని ఊరు ఒక్కటంటే ఒక్కటైనా చూపగలరా? భద్రాచలంలో, ఇల్లందకుంటలో, అమ్మపల్లిలో, రాచకొండలో, ధర్మపురిలో, డిచ్‌పల్లిలో రాముడి ప్రముఖ ఆలయాలు ఉన్నాయి. ఇక తెలంగాణ గ్రామ గ్రామాన సీతారామ, కోదండరామ, రామచంద్రస్వామి దేవాలయాలు చాలా ఉన్నాయి. మరి రాముడు ఉత్తర భారత దేవుడు ఎలా అవుతాడు? రామ సంస్కృతి ఉత్తర భారత సంస్కృతి ఎలా అవుతుంది? అసలు శివకేశవ భేదం సృష్టించడం ద్వారా ముఖ్యమంత్రి సమాజాన్ని ఏం చేద్దామనుకుంటున్నారో తెలియడంలేదు. భద్రాచలంలోనే భద్రాద్రికి అనుబంధంగా ఉన్న రంగనాయకుల గుట్టపై రామలింగేశ్వరస్వామి ఆలయం ఉన్నది. ఇల్లందకుంటలో త్రికూట నిర్మాణంలో శివలింగం ఉంటుంది. శీర్సనగండ్లలో రామాలయం, రామలింగేశ్వరుడు కలిసి ఉంటారు. బ్రాహ్మణ కొత్తపల్లిలో రాణి రుద్రమదేవి నిర్మించిన పట్టాభి సీతారామస్వామి ఆలయంలో అత్యంత పురాతనమైన శివ సన్నిధి ఉన్నది. తెలంగాణే కాదు.. మన ఆరాధన సంప్రదాయంలో శివ, కేశవ ఆరాధనలు పరస్పర విరోధాలు కావు. ఒకే క్షేత్ర సంప్రదాయంలో కలిసి ఉండేవి. రాముడు చెప్తేనే పోతన భాగవతాన్ని రాశాడు కదా..! మరి ఏ ప్రాతిపదికన శివుడు పేదల దేవుడు, రాముడు ధనికుల దేవుడు అని సీఎం విభజన రేఖ గీస్తున్నారు.
గతంలోనూ తెలంగాణలో మతపరమైన రాజకీయాలు చేసి సమాజాన్ని చీల్చే కుట్రలు చాలా జరిగాయి. కానీ, మన సమాజం ఇలాంటి రాజకీయాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించదు. ఇక్కడ ప్రజల్లో భక్తి ఉన్నది కానీ, మతోన్మాదం లేదు. మనుగడ కోసం దాదాపు 800 వందల ఏండ్లపాటు పోరాటం చేసిన సమాజం ఇది. అధిక్షేపం ఇక్కడి రక్తంలోనే ఉన్నది. పోతన లాంటి వాడే నా కావ్యాన్ని ఎవ్వడికీ ఇవ్వను పొమ్మన్నాడు. అలాంటిది ఉత్తరాదిలో మాదిరిగా ఇక్కడ మత రాజకీయాలు ప్రభావం చూపుతాయని అనుకోవడం భ్రమే. ఈ విషయం తెలంగాణలో బీజేపీ పరిస్థితి చూస్తేనే ఎవరికైనా అర్థమవుతుంది.
ఇక రాష్ట్రంలో బీజేపీకి తాను విధేయుడనని చాటుకోవడానికి అవకాశం దొరికినప్పు డల్లా రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తూనే ఉన్నారు. తాజా వ్యాఖ్యల్లో కూడా మోదీ నాలుగోసారి ఎలా గెలువాలో, ఎలాంటి వ్యూహంతో ముందుకెళ్లాలో ఒక ఏబీవీపీ మాజీ కార్యకర్తగా చిట్కా చెప్పారు కూడా. పాపం ఒరిజినల్ కాంగ్రెస్ వారికే ఈ వ్యవహారం అర్థం కావటం లేదు. లేదా.. తమకు వేరే ప్రత్యామ్నాయం లేక భరిస్తున్నారేమో తెలియదు. మరోవైపు ద్రవిడ ఉద్యమం అనేది ప్రధానంగా తమిళనాడుకే పరిమితమైంది. కొంతవరకు ఏపీ రాజకీయాలను తొలినాళ్లలో ప్రభావితం చేసింది. కానీ, తెలంగాణకు ఇలాంటి రాజకీయాలు పడవు. మనది పూర్తిగా లౌకిక ప్రజాస్వామ్య సమాజం. ఈ సమాజాన్ని మతపరమైన, జాతిపరమైన పరస్పర విరుద్ధమైన, చీలిక రాజకీయాలతో ప్రభావితం చేయడం సాధ్యమయ్యేపని కాదు. చివరగా ఒక్కమాట.
శివాయ విష్ణురూపాయ శివరూపాయ విష్ణవే,శివస్య హృదయం విష్ణుః విష్ణోశ్చ హృదయం శివః
విష్ణు రూపంలో ఉన్న శివుడికి నమస్కారం.. శివుడి రూపంలో ఉన్న విష్ణువుకు నమస్కారం. శివుని హృదయంలో విష్ణువు ఉన్నాడు.. విష్ణువు హృదయంలో శివుడు ఉన్నాడని దీని అర్థం. ఈ ఒక్క శ్లోకం మన సమాజంలో వేల ఏండ్లుగా కొనసాగుతున్న సమన్వయ సంప్రదాయానికి ప్రతిబింబం. అలాంటి సమాజంలో ఫలానా దేవుడు ధనికుల దేవుడు, ఫలానా దేవుడు పేదల దేవుడు అంటే ప్రజలు నవ్వుకోరా.. అలా మాట్లాడినవాళ్లు నవ్వులపాలు కారా? ఆ మాత్రం లాజిక్ మిస్ అయితే ఎలా? ఆ మాత్రం ఆలోచన లేకపోతే ఎలా?


నష్ట నివారణలో ఇసి



ఎన్నికల ప్రధాన కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ తీసుకున్న నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి 14 అభ్యంతరాలు వ్యక్తం చేసిన విషయం బయటపడి తీవ్ర సంచలనం కలిగించిన సంగతి తెలిసిందే. దీంతో కాక్రోచ్ జనతా పార్టీ, విపక్షాలు ఆందోళనకు దిగడం, ఎన్నికల కమిషన్‌పై ప్రజల్లో ప్రతికూల అభిప్రాయం ఏర్పడడంతో ఎన్నికల కమిషన్ తన అప్రతిష్ఠను నివారించుకునే చర్యలు చేపట్టింది. ఈమేరకు శనివారం ఎన్నికల సంఘం పత్రికా ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రకటనలో కమిషనర్ల ఫిర్యాదులను కొంతవరకు అంగీకరించింది. ఇకపై సమావేశాలకు ముందే అజెండాను పంపుతామని, సమావేశాల తరువాత మినిట్స్ (నిర్ణయాల వివరాలను) అందజేస్తామని, తదితర వివరణలతోపాటు 'సర్' లో లోపాలు ఉన్నాయని పరోక్షంగా అంగీకరించింది. ఓటరు జాబితానుంచి ఎవరి పేరైనా తొలగించినట్టయితే వారిని తిరిగి జాబితాలో చేర్చేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలని ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లకు సూచించింది. అయితే 'పశ్చిమబెంగాల్‌లో న్యాయాధికారులు చేర్చిన ఓటర్లను తొలగించేందుకు 16.1లక్షల అప్పీళ్లను ఎవరు అనుమతించారు?' అని ఎన్నికల కమిషనర్ సుఖ్‌బీర్ సింగ్ సంధు అడిగిన ప్రశ్నకు ఇప్పటికీ సమాధానం లేకపోవడం గమనార్హం. జ్ఞానేశ్ కుమార్ నేతృత్వం లోని ఎన్నికల కమిషన్ 'సర్' ప్రక్రియ ద్వారా ముసాయిదా ఓటర్ల జాబితానుంచి 13కోట్లకు పైగా పేర్లను తొలగించింది. స్వయంగా అర్హులైన ఓటర్లను నమోదు చేయాల్సిన ప్రభుత్వ బాధ్యతను ఓటర్లపైనే మోపుతున్నారన్న విమర్శలు వచ్చాయి అంటే పేర్లను ముందుగా తొలగించి, తరువాత వాటిని ధ్రువీకరించే విధానం అమలైంది. తిరిగి ఓటర్ల జాబితాలో పేరు చేర్చుకోవడానికి ఓటర్లపై కఠినమైన, భారమైన నిబంధనలు విధిస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా (సర్) రాజ్యాంగబద్ధమైనదా కాదా అనే విషయంపై సుప్రీం కోర్టు నెలల తరబడి నిర్ణయం తీసుకోకపోవడంతో కొన్ని లోపాలు చోటుచేసుకున్నాయి. చివరకు మే 27న కోర్టు తీర్పు ఇచ్చే సమయానికి బీహార్, పశ్చిమబెంగాల్, రెండో దశలోఉన్న ఇతర రాష్ట్రాల్లో 'సర్' ప్రక్రియ అప్పటికే ప్రారంభమై, వాస్తవ పరిస్థితిని మార్చేసింది. సుప్రీం కోర్టు తీర్పు ఎడిఎం జబల్‌పూర్ కేసులో ప్రభుత్వం పట్ల కోర్టు చూపిన విధేయతను గుర్తు చేసేలా ఉందన్న విమర్శలు తలెత్తాయి. 'సర్'ను ఆచరణలో ఎలా అమలు చేశారన్న దానికంటే సిద్ధాంతపరంగా ఎలా ఉండాలో కోర్టు చూసింది. అసాధారణమైన, నిర్దిష్టమైన సందర్భాల్లో మాత్రమే చేయాల్సిన ఓటర్ల జాబితా సవరణ నిబంధనను, రాష్ట్రవ్యాప్తంగా భారీస్థాయిలో సవరణ చేయడానికి అనుమతిగా భావించారు. ఇప్పటికే ఓటర్ల జాబితాలో ఉన్నవారు అర్హులేనని నిరూపించాల్సిన అవసరం లేదని చెప్పినప్పటికీ, సర్ ద్వారా వారు మళ్లీ తమ అర్హతను నిరూపించుకోవలసి వచ్చింది. అలాగే 1995 నాటి సుప్రీం కోర్టు తీర్పులో ఓటర్ల జాబితాలో ఎవరి పేరునైనా తొలగించడానికి వ్యక్తిగత కారణం ఉండాలని వెల్లడించిన విషయాన్ని కూడా ఇప్పటి సుప్రీం కోర్టు తీర్పు పక్కన పెట్టిందని విమర్శలు వస్తున్నాయి. పశ్చిమబెంగాల్ లోని ట్రైబ్యునల్ తీర్పు ఇచ్చిన అప్పీళ్లలో 90 శాతానికి పైగా, అసెంబ్లీ ఎన్నికలు జరిగిన కొన్ని నెలల తర్వాత తొలగించబడిన ఓటర్లను మళ్లీ ఓటర్ల జాబితాలో చేర్చారు.
అలాగే ఢిల్లీ లోని మూడోవంతు నియోజకవర్గాల్లో, ముసాయిదా ఓటర్ల జాబితాలో ఉన్న ఓటర్ల సంఖ్య 2025లో వాస్తవంగా ఓటు వేసిన వారికంటే తక్కువగా ఉంది. ఢిల్లీలో ఆగస్టు 31న విడుదలైన ముసాయిదా ఓటర్ల జాబితాలో 97.5లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 31.6 లక్షల మందికి రెండు కారణాల కింద నోటీసులు జారీ చేశారు. ఒకటి ఓటరు వివరాలను సంబంధిత పాత రికార్డులతో సరిపోల్చలేకపోవడం, రెండోది తార్కిక వ్యత్యాసాలు. రెండోది.. ఓటరు వివరాల్లో కొన్ని అసంగతలు ఉండడం. దీంతో 31.6లక్షల మంది ఓటర్లు ఇఆర్ఒ, ఎఇఆర్ఒ కార్యాలయాలకు స్వయంగా వెళ్లాల్సి వస్తుందేమో అన్న ఆందోళన ఏర్పడింది. అయితే ఇప్పుడు ఎన్నికల కమిషన్ వెల్లడించిన వివరాల ప్రకారం బూత్‌లెవెల్ అధికారులు (బిఎల్ఒ) ఓటర్ల ఇళ్లకే వెళ్లి వివరాలను పరిశీలిస్తారు. అత్యవసరమైన, ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే వ్యక్తిగతంగా విచారణకు హాజరు కావలసి ఉంటుంది. అంటే పౌరుడు ఇబ్బందులు పడుతూ అధికారులను సంప్రదించాల్సిన పరిస్థితి లేకుండా సంస్థే పౌరుడు దగ్గరకు వెళ్లే విధానం అమలవుతుంది. అయితే ఈ పనిని కేవలం 14,000 మంది బూత్ లెవెల్ అధికారులు ఎలా నిర్వహిస్తారనేది ఆందోళన కలిగించే విషయం. రాత్రుళ్లు షెల్టర్లలో నివసించే వారు, కూలీలు, పేదలు, నిరాశ్రయులు, మొదలైన వారి వివరాల నమోదు కోసం తగిన హెల్ప్ డెస్కులు, ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తామని ఎన్నికల కమిషన్ చెబుతోంది. మరి ఇది ఎలా అమలవుతుందో చూడాలి. మరో ముఖ్యమైన ఓటరు సమస్య ఫారం 6. ఓటర్ల జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకునే ప్రతి పెద్దవారు ఈ ఫారమ్‌ను నింపాలి. ఆన్‌లైన ఫారమ్ 6 లో కొత్త ఓటర్లు తమ తల్లిదండ్రులు, లేదా తాతయ్య, అమ్మమ్మలు చివరి 'సర్'కు సంబంధించిన ఓటర్ల జాబితాలో ఉన్నారా? అన్నది ప్రకటించాలి. అయితే కొత్త ఓటర్లు ఎలాంటి డిక్లరేషన్ ఇవ్వకుండానే ఫారమ్ 6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. అయితే 'సర్' ప్రక్రియలో ఇలాంటి నిబంధన ఉండకూడదన్న వాదన వస్తోంది. శనివారం ఎన్నికల సంఘం విడుదల చేసిన ప్రెస్‌నోట్‌లో పెద్దగా మార్పేమీ కనిపించడం లేదు. ప్రభుత్వ ఆధిపత్యం చెలాయించలేని విధంగా ఉండే ఎంపిక కమిటీ ద్వారా ఎన్నికల కమిషన్‌ను పునర్వవస్థీకరించాలి.

దేశంలో పెరుగుతున్న అల్జీమర్స్ వ్యాధి కేసులు..

-లక్షణాలను ముందే గుర్తించాలంటున్న నిపుణులు..



చిత్తవైకల్యం కేసుల్లో ఎక్కువ భాగం అల్జీమర్స్ వ్యాధికి సంబంధించినవేనని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇది మెదడులోని నాడీకణాలను క్రమంగా దెబ్బతీసే ప్రగతిశీల నాడీ సంబంధిత వ్యాధి. సాధారణంగా అల్జీమర్స్ అంటే జ్ఞాపకశక్తి తగ్గడం మాత్రమేనని భావిస్తారు. అయితే వ్యాధి ప్రభావం పెరిగే కొద్దీ ఆలోచించడం, విషయాలను అర్థం చేసుకోవడం, మాట్లాడటం, నిర్ణయాలు తీసుకోవడం, రోజువారీ పనులను స్వతంత్రంగా చేసుకోవడం వంటి సామర్థ్యాలపైనా ప్రభావం పడుతుంది. అల్జీమర్స్ లక్షణాలు స్పష్టంగా బయటకు కనిపించడానికి చాలా సంవత్సరాల ముందే మెదడులో మార్పులు ప్రారంభమయ్యే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా మెదడులో అమైలాయిడ్ అనే ప్రొటీన్ అసాధారణంగా పేరుకుపోవడం వంటి మార్పులు సాధారణ లక్షణాలు కనిపించడానికి సుమారు 20 ఏళ్ల ముందే ప్రారంభమయ్యే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. అందువల్ల వ్యాధి లక్షణాలు తీవ్రంగా మారే వరకు వేచి ఉండకుండా ప్రారంభ సంకేతాలపై దృష్టి పెట్టడం అవసరమని సూచిస్తున్నారు. వ్యాధిని తొలిదశలోనే గుర్తించడం వల్ల బాధితులు, వారి కుటుంబ సభ్యులు పరిస్థితిని మెరుగ్గా అర్థం చేసుకునే అవకాశం ఉంటుంది. భవిష్యత్తులో అవసరమయ్యే వైద్య సంరక్షణ, కుటుంబ సహకారం, ఇతర సహాయక సేవల గురించి ముందుగానే ప్రణాళిక రూపొందించుకోవచ్చు. అలాగే అందుబాటులో ఉన్న చికిత్స, సంరక్షణ మార్గాలపై వైద్యుల సలహా తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. జ్ఞాపకశక్తిలో పదేపదే మార్పులు కనిపించడం, ఇటీవల జరిగిన విషయాలను గుర్తుంచుకోవడంలో ఇబ్బంది, సాధారణ విషయాలను అర్థం చేసుకోవడంలో సమస్యలు, నిర్ణయాలు తీసుకోవడంలో ఇబ్బంది, సంభాషణలో మార్పులు వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదని నిపుణులు సూచిస్తున్నారు. గతంలో సులభంగా చేసుకునే రోజువారీ పనులను స్వతంత్రంగా చేయలేకపోవడం కూడా గమనించాల్సిన అంశమే. అయితే ఇలాంటి లక్షణాలు కనిపించినంత మాత్రాన అల్జీమర్స్ అని నిర్ధారించలేమని, ఇతర ఆరోగ్య సమస్యలు కూడా కారణం కావచ్చని వైద్యులు చెబుతున్నారు. అందుకే సరైన వైద్య పరీక్షల ద్వారా అసలు కారణాన్ని గుర్తించడం ముఖ్యమని సూచిస్తున్నారు. అల్జీమర్స్ ప్రభావం ఒక్క బాధితుడికే పరిమితం కాదు. వ్యాధి ముదిరే కొద్దీ కుటుంబ సభ్యులపై కూడా సంరక్షణ బాధ్యత పెరుగుతుంది. అందువల్ల వృద్ధుల్లో జ్ఞాపకశక్తి, ఆలోచనా సామర్థ్యం, ప్రవర్తన, రోజువారీ పనితీరులో వస్తున్న మార్పులను కుటుంబ సభ్యులు ఎప్పటికప్పుడు గమనించాలి. అనుమానాస్పద మార్పులు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వైద్య నిపుణులను సంప్రదించడం ద్వారా పరిస్థితిని అర్థం చేసుకునే అవకాశం ఉంటుంది. వ్యాధి గురించి ప్రజల్లో అవగాహన పెంచడం, ప్రారంభ లక్షణాలను గుర్తించడం, సకాలంలో వైద్య సహాయం తీసుకోవడం కీలకమని నిపుణులు చెబుతున్నారు. కుటుంబ సభ్యుల అవసరాలు, అభిప్రాయాలు, భవిష్యత్తు సంరక్షణకు సంబంధించిన అంశాలపై ముందుగానే చర్చించుకోవడం కూడా ఉపయోగకరంగా ఉంటుందని సూచిస్తున్నారు. దీనివల్ల వ్యాధి తీవ్రత పెరిగే కొద్దీ ఎదురయ్యే పరిస్థితులను ఎదుర్కొనేందుకు కుటుంబం ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండవచ్చు.

డయాబెటిస్ ఉన్నవారు పండ్లు తినేటప్పుడు ఈ జాగ్రత్తలు

పండ్లను పూర్తిగా తినడం మంచిది
జ్యూస్‌కు బదులు తాజా పండ్లకే ప్రాధాన్యం
పీచు అధికంగా ఉండే పండ్లను ఎంచుకోవాలి
జామ, బెర్రీలు, యాపిల్, పియర్ మంచి ఎంపికలు
కివి, బొప్పాయిని పరిమితంగా తీసుకోవాలి
మామిడి, ద్రాక్ష పరిమాణంపై నియంత్రణ అవసరం
ఎండబెట్టిన పండ్లకు దూరంగా ఉండటం మంచిది
పండ్లను మితంగా తీసుకోవడమే కీలకం



మధుమేహం ఉన్నవారు పండ్లలో సహజ చక్కెర ఉంటుందని వాటిని పూర్తిగా దూరం పెడుతుంటారు. అయితే పండ్లలో సహజ చక్కెరతో పాటు శరీరానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు, పీచు పదార్థం కూడా లభిస్తాయి. అందువల్ల మధుమేహం ఉన్నవారు పండ్లను పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదని నిపుణులు చెబుతున్నారు. అయితే ఏ పండు ఎంత పరిమాణంలో తీసుకుంటున్నారనే విషయంలో జాగ్రత్త అవసరం. పండ్లను రసం రూపంలో తీసుకోవడం కంటే పూర్తిగా తినడం మంచిది. పండ్లలో ఉండే పీచు పదార్థం జీర్ణక్రియను నెమ్మదింపజేయడంతో రక్తంలోకి చక్కెర వేగంగా చేరకుండా సహాయపడుతుంది. ఫలితంగా రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు ఒక్కసారిగా పెరిగే అవకాశం తగ్గుతుంది. జ్యూస్ చేసేటప్పుడు పీచు తగ్గిపోవడంతో పాటు ఒకేసారి ఎక్కువ పరిమాణంలో పండు తీసుకునే పరిస్థితి ఏర్పడవచ్చు. జామపండు మధుమేహం ఉన్నవారికి సరైన పరిమాణంలో తీసుకోగల మంచి ఎంపికగా చెబుతున్నారు. ఇందులో పీచుతో పాటు విటమిన్ సి కూడా సమృద్ధిగా ఉంటుంది. స్ట్రాబెర్రీ, బ్లూబెర్రీ, రాస్ప్‌బెర్రీ వంటి బెర్రీల్లో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, కరిగే పీచు ఉండటంతో పాటు సహజ చక్కెర తక్కువగా ఉంటుంది. పియర్‌లో పీచు అధికంగా ఉండటంతో చక్కెర రక్తంలోకి నెమ్మదిగా విడుదల కావడానికి తోడ్పడుతుంది. యాపిల్‌ను తొక్కతో తినడం ద్వారా పీచు, ఇతర పోషకాలు ఎక్కువగా లభిస్తాయి. నారింజలో పీచు, విటమిన్ సి, పొటాషియం వంటి పోషకాలు ఉంటాయి. అయితే నారింజ రసం తాగడం కంటే పండును పూర్తిగా తినడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. కివిలో విటమిన్ సి, విటమిన్ ఇ, పొటాషియం, పీచు వంటి పోషకాలు ఉంటాయి. అయితే దీనిని కూడా పరిమిత పరిమాణంలో తీసుకోవాలి. బొప్పాయిలో యాంటీఆక్సిడెంట్లు, సహజ ఎంజైములు ఉన్నప్పటికీ సహజ చక్కెర ఉండటంతో మితంగా తీసుకోవడం అవసరం. దానిమ్మలో యాంటీఆక్సిడెంట్లు, ఇనుము వంటి పోషకాలు ఉన్నప్పటికీ పరిమాణాన్ని నియంత్రించడం మంచిది. మామిడిపండులో సహజ చక్కెర ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున మధుమేహం ఉన్నవారు పరిమిత పరిమాణంలో తీసుకోవాలి. ద్రాక్షను కూడా తెలియకుండానే ఎక్కువగా తినే అవకాశం ఉంటుంది. అందువల్ల ద్రాక్ష తినేటప్పుడు పరిమాణంపై ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టాలి. ఒకేసారి ఎక్కువ పండ్లు తినకుండా తగిన మోతాదులో తీసుకోవడం ముఖ్యం. పండ్లను గింజలు, పెరుగు వంటి ప్రొటీన్ కలిగిన ఆహారాలతో లేదా ఆరోగ్యకరమైన కొవ్వులు ఉన్న పదార్థాలతో కలిపి తీసుకోవడం కొందరికి రక్తంలో చక్కెర పెరుగుదలను నెమ్మదించడంలో సహాయపడవచ్చు. బెర్రీలు, చెర్రీలు, యాపిల్, పియర్ వంటి పండ్లను తగిన పరిమాణంలో ఎంచుకోవచ్చు. యాపిల్, పియర్ వంటి పండ్లను సాధ్యమైనంత వరకు తొక్కతో తినడం ద్వారా అదనపు పీచు లభిస్తుంది. తాజా పండ్లకు బదులుగా పండ్ల రసాలు లేదా ఎండబెట్టిన పండ్లను ఎక్కువగా తీసుకోవడం మంచిది కాదు. ముఖ్యంగా ఎండబెట్టిన పండ్లలో పరిమాణానికి తగ్గట్టుగా చక్కెర ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. ఏ పండు తిన్న తర్వాత రక్తంలో చక్కెర స్థాయుల్లో ఎలాంటి మార్పు వస్తుందో గమనించడం కూడా ఉపయోగకరంగా ఉంటుంది. అయితే వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులు, మందులు, రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను బట్టి ఆహార ఎంపికలు మారవచ్చు. కాబట్టి మధుమేహం ఉన్నవారు తమ వైద్యుడు లేదా డైటీషియన్ సూచనలకు అనుగుణంగా పండ్ల పరిమాణాన్ని నిర్ణయించుకోవడం మంచిది.

కాఫీ తాగిన వెంటనే బాత్రూంకి వెళ్తున్నారా?

-మీ పొట్టలో ఏం జరుగుతుందో తెలుసా?

కాఫీ తాగిన వెంటనే బాత్రూంకి వెళ్లాల్సి వస్తుందా? కాఫీ పెద్ద పేగు కదలికలను ప్రేరేపించడం వల్ల కొందరిలో మల విసర్జన త్వరగా జరుగుతుంది. ఈ ప్రభావం డీక్యాఫ్ కాఫీలోనూ కనిపించవచ్చని పరిశోధనలు సూచిస్తున్నాయి. కాఫీలోని పాలీఫెనాల్స్ పేగుల్లోని కొన్ని ప్రయోజనకరమైన బ్యాక్టీరియాకు మద్దతు ఇవ్వవచ్చు. అయితే సున్నితమైన కడుపు ఉన్నవారిలో కాఫీ గుండెల్లో మంట, యాసిడ్ రిఫ్లక్స్, కడుపు అసౌకర్యాన్ని పెంచవచ్చు. కెఫీన్ అప్రమత్తత, ఏకాగ్రతను పెంచుతుంది. దీర్ఘకాలిక అధ్యయనాల్లో కాఫీ తీసుకోవడం కొన్ని న్యూరోడీజెనరేటివ్ వ్యాధుల తక్కువ ప్రమాదంతో సంబంధం ఉన్నట్లు గుర్తించారు. అయితే అధికంగా తాగితే నిద్రలేమి, ఆందోళన, కడుపు సమస్యలు రావచ్చు. అందుకే కాఫీని మితంగా తీసుకోవడం మంచిది.



బాలికల్లో సక్రమంగా లేని రుతుక్రమం

-ప్రతి ఐదుగురిలో ఒకరికి సమస్య



బాలికల్లో రుతుక్రమం సక్రమంగా లేకపోవడం ఇటీవలి కాలంలో ఎక్కువగా కనిపిస్తోంది. ఎయిమ్స్ నిర్వహిస్తున్న సర్వేలో ప్రతి ఐదుగురు పాఠశాల బాలికల్లో ఒకరికి రుతుక్రమం సక్రమంగా లేదని వెల్లడైంది. అయితే రుతుక్రమంలో మార్పులు కనిపించిన ప్రతిసారీ దాన్ని పీసీఓఎస్‌గా భావించకూడదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా రుతుస్రావం ప్రారంభమైన తొలి సంవత్సరాల్లో హార్మోన్ల మార్పుల వల్ల రుతుక్రమం కొంతకాలం అస్తవ్యస్తంగా ఉండటం సాధారణమేనని చెబుతున్నారు.

ఎప్పుడు వైద్యులను సంప్రదించాలి?

రుతుస్రావాల మధ్య వ్యవధి 21 రోజుల కంటే తక్కువగా ఉండటం, 35 రోజుల కంటే ఎక్కువగా ఉండటం లేదా వరుసగా మూడు నెలలు రుతుస్రావం రాకపోవడం వంటి పరిస్థితుల్లో వైద్యులను సంప్రదించాలని నిపుణులు సూచిస్తున్నారు. రుతుక్రమం సక్రమంగా లేకపోవడం ఒక్కటే పీసీఓఎస్ నిర్ధారణకు సరిపోదని స్పష్టం చేస్తున్నారు. తీవ్రమైన మొటిమలు, ముఖం లేదా శరీరంపై అధికంగా వెంట్రుకలు పెరగడం వంటి లక్షణాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

పరీక్షలతోనే నిర్ధారణ

అల్ట్రాసౌండ్‌లో అండాశయాల్లో పాలిసిస్టిక్ లక్షణాలు కనిపించినంత మాత్రాన పీసీఓఎస్ ఉన్నట్లు నిర్ధారించలేమని వైద్యులు చెబుతున్నారు. రుతుక్రమంలో కొనసాగుతున్న మార్పులు, హార్మోన్ల ప్రభావానికి సంబంధించిన లక్షణాలు, ఇతర ఆరోగ్య సమస్యలను కలిపి పరిశీలించిన తర్వాతే నిర్ధారణ చేయాలి.

ఆరోగ్యంపై ప్రభావం

పీసీఓఎస్ ఉంటే భవిష్యత్తులో ఇన్సులిన్ నిరోధకత, ఊబకాయం, టైప్-2 మధుమేహం, ఫ్యాటీ లివర్ వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. అయితే ప్రతి బాలికకు మందులు అవసరం లేదని నిపుణులు సూచిస్తున్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, సమతుల ఆహారం తీసుకోవడం, బరువును పర్యవేక్షించడం ద్వారా భవిష్యత్తు ఆరోగ్య సమస్యల ముప్పును తగ్గించుకోవచ్చని చెబుతున్నారు.

వార్తసంధ్య
www.vaarthasandhya.com

జింబాబ్వేలో హెలికాప్టర్ కూలి ఏడుగురు మృతి

మారోండెరా గ్రామీణ ప్రాంతంలో ప్రమాదం
హెలికాప్టర్‌లో ఏడుగురు ఉన్నట్లు ప్రభుత్వ ప్రకటన
ప్రముఖ వ్యాపారవేత్త సహా ఏడుగురు మృతి
ఇద్దరు పైలట్లు, నలుగురు ప్రయాణికులు మృతి
ప్రమాదంలో ఎవరూ ప్రాణాలతో బయటపడలేదు
ఘటనా స్థలానికి చేరుకున్న అత్యవసర సిబ్బంది
మృతుల సంఖ్యపై భిన్న కథనాలు
పూర్తి వివరాల కోసం కొనసాగుతున్న దర్యాప్తు




హరారే:- (వార్త సంధ్య)అక్టోబర్. 1 : జింబాబ్వేలో ఘోర హెలికాప్టర్ ప్రమాదం చోటుచేసుకుంది. ఈశాన్య ప్రాంతంలోని మారోండెరా గ్రామీణ ప్రాంతంలో బుధవారం హెలికాప్టర్ కూలిపోయింది. ఈ ఘటనలో ప్రముఖ వ్యాపారవేత్తతో పాటు నలుగురు ప్రయాణికులు, ఇద్దరు పైలట్లు సహా మొత్తం ఏడుగురు మృతి చెందినట్లు ప్రభుత్వ ప్రతినిధి నిక్ మంగ్వానా వెల్లడించారు. హెలికాప్టర్ ప్రమాదానికి గురైన విషయం తెలియగానే అత్యవసర సేవల సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టి మృతదేహాలను వెలికితీసే ప్రక్రియను ప్రారంభించారు. ప్రమాదంలో ప్రయాణిస్తున్న వారిలో ఎవరూ ప్రాణాలతో బయటపడలేదని అధికారులు తెలిపారు. అయితే ప్రమాదానికి సంబంధించి ప్రయాణికుల సంఖ్యపై భిన్నమైన సమాచారం వెలువడుతోంది. హెలికాప్టర్‌లో ఎంతమంది ఉన్నారనే విషయంలో పోలీసుల వివరాలకు, ప్రభుత్వ ప్రతినిధి వెల్లడించిన సమాచారానికి పొంతన లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. దీంతో మృతుల సంఖ్య అధికారికంగా వెల్లడించిన దానికంటే ఎక్కువగా ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. హెలికాప్టర్ సాంకేతిక లోపం కారణంగానే కూలిపోయిందా? లేక మరేదైనా కారణం ఉందా? అనే విషయంపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

జనన, మరణాల నమోదుకు కొత్త రూల్స్



న్యూఢిల్లీ (వార్త సంధ్య)అక్టోబర్. 1 : జనన-మరణాల నమోదు చట్టం-2026 గురువారం నుంచి అమల్లోకి వచ్చింది. దీంతో జనన, మరణాల రిజిస్ట్రేషన్ల ఆలస్యంపై నిబంధనలు మరింత కఠినతరం కానున్నాయి. ఇక నుంచి వ్యక్తి జన్మించిన లేదా మరణించిన ఏడాది తర్వాత రెండేండ్ల లోపు సమాచారం ఇస్తే.. జిల్లా మెజిస్ట్రేట్ లేదా సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ లేదంటే ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ అధికారం ఉన్న అధికారి తనిఖీ చేసి ఆదేశాలు ఇచ్చిన తర్వాత సంబంధిత రుసుము చెల్లించాక నమోదు చేస్తారు.. ఒకవేళ రెండేండ్లు దాటిన తర్వాత సమాచారం ఇస్తే ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఆదేశాలు తప్పనిసరిగా ఉండాల్సిందే. ఈ కొత్త చట్టం ప్రకారం జనన, మరణాల చట్టం 1969లోని 13(3)ను మార్చడంతో పాటు కొత్తగా సెక్షన్ 13(3ఏ)ను చేర్చారు.

అన్ని విమానాశ్రయాల్లో ఫుల్ బాడీ స్కానర్లు!



న్యూఢిల్లీ- (వార్త సంధ్య)అక్టోబర్. 1 : పశ్చిమాసియాలో ఫ్లైదుబాయ్ విమాన ఘటనతో భారత్ అప్రమత్తమైంది. ఇకపై అన్ని విమానాశ్రయాల్లో పూర్తి బాడీ స్కానర్లు (ఎఫ్‌బీఎస్)లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వైమానిక భద్రతా వ్యవస్థ పటిష్ఠతలో భాగంగా వీటిని ఏర్పాటు చేయనున్నట్టు పౌరవిమానయాన శాఖ అధికారులు తెలిపారు. మొద టి దశలో ఎనిమిది విమానాశ్రయా ల్లో వీటిని ఏర్పాటు చేస్తామని ఆ శాఖ కార్యదర్శి సమీర్ సిన్హా తెలిపారు. ఇప్పటికే మూడు ఎయిర్‌పోర్టులకు స్కానర్ మిషన్లను పంపినట్టు తెలిపారు. మిగిలిన ఐదింటిలో త్వరలోనే ఏర్పాటు చేస్తామని చెప్పారు.

ఎస్పీతో టచ్‌లో బీజేపీ ఎమ్మెల్యేలు!

వెల్లడించిన అఖిలేశ్ యాదవ్



లక్నో, (వార్త సంధ్య)అక్టోబర్. 1 : చాలామంది బీజేపీ ఎమ్మెల్యేలు తమ పార్టీతో టచ్‌లో ఉన్నారని, అయితే వారందరికీ పార్టీలో స్థానం కల్పించడం కష్టమని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీ ఎమ్మెల్యేలు తమ పార్టీలోకి వస్తామంటూ ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. అయితే వారికి స్థానం కల్పించే పరిస్థితి పార్టీలో లేదని పేర్కొన్నారు. మేం కేవలం వారికి మాట ఇచ్చి తర్వాత వాటిని తప్పాలని అనుకోవడం లేదన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల మాదిరిగానే అదే కూటమి పార్టీలతో కలిసి వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో పోటీకి దిగుతామని చెప్పారు. త్వరలోనే కూటమి పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

తొమ్మిదేళ్ల తర్వాత కాంగ్రెస్‌లోకి వాఘేలా?

-కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమన్న శంకర్‌సింహ్ వాఘేలా
-రాహుల్‌గాంధీతో భేటీ తర్వాత తుది నిర్ణయం
-కాంగ్రెస్ నేతలతో కొనసాగుతున్న చర్చలు
-రణ్‌దీప్ సూర్జేవాలాతోనూ భేటీ
-అమిత్ చావ్డా, భరత్‌సింహ్ సోలంకితో చర్చలు
-2027 ఎన్నికలే చివరి అవకాశమన్న వాఘేలా
-2017లో కాంగ్రెస్‌ను వీడిన వాఘేలా
-సొంత పార్టీ కార్యక్రమాన్ని వాయిదా



గాంధీనగర్: (వార్త సంధ్య)అక్టోబర్. 1 : గుజరాత్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ ముఖ్యమంత్రి, సీనియర్ నేత శంకర్‌సింహ్ వాఘేలా దాదాపు తొమ్మిదేళ్ల విరామం తర్వాత తిరిగి కాంగ్రెస్‌లో చేరే అంశంపై చర్చలు జరుగుతున్నాయి. కాంగ్రెస్ నేతలతో తనకు చర్చలు జరుగుతున్నాయని వాఘేలా స్వయంగా వెల్లడించారు. అయితే కాంగ్రెస్‌లో తిరిగి చేరడంపై తుది నిర్ణయం మాత్రం రాహుల్‌గాంధీతో భేటీ అనంతరం తీసుకుంటానని ఆయన స్పష్టం చేశారు. 2027 గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్‌లో చేరేందుకు తాను సిద్ధంగా ఉన్నానని వాఘేలా తెలిపారు. బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించేందుకు కాంగ్రెస్‌తో కలిసి పనిచేయాలనుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. పార్టీ నుంచి తనకు ఎలాంటి పదవి లేదా ఇతర ప్రయోజనాలు ఆశించడం లేదని, కాంగ్రెస్‌కు తన వంతు సహకారం అందించేందుకే తిరిగి రావాలని భావిస్తున్నట్లు చెప్పారు. వాఘేలా ఇప్పటికే కాంగ్రెస్ గుజరాత్ ఇన్‌చార్జి రణ్‌దీప్ సూర్జేవాలా, గుజరాత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అమిత్ చావ్డా, మాజీ కేంద్ర మంత్రి భరత్‌సింహ్ సోలంకితో చర్చలు జరిపినట్లు సమాచారం. వాఘేలా తిరిగి పార్టీలోకి వచ్చే అంశంపై కాంగ్రెస్ అధిష్ఠానంతో చర్చలు కొనసాగుతున్నాయని అమిత్ చావ్డా కూడా తెలిపారు. అయితే ఆయనకు పార్టీలో ఎలాంటి బాధ్యత అప్పగించాలనే అంశంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. 2017లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు వాఘేలా కాంగ్రెస్‌ను వీడారు. ఆ తర్వాత వివిధ రాజకీయ ప్రయత్నాలు చేసిన ఆయన.. ప్రస్తుతం తిరిగి కాంగ్రెస్ వైపు అడుగులు వేస్తున్నారు. దాదాపు తొమ్మిదేళ్ల తర్వాత ఆయన కాంగ్రెస్‌లోకి తిరిగి వస్తారా అనే అంశంపై గుజరాత్ రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. ఇదిలా ఉండగా, అక్టోబర్ 2న తన సొంత పార్టీ 'ప్రజా శక్తి డెమోక్రటిక్ పార్టీ' కార్యక్రమాన్ని పునరుద్ధరించేందుకు వాఘేలా ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే కాంగ్రెస్‌తో జరుగుతున్న చర్చల నేపథ్యంలో ఆ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు సమాచారం. దీంతో ఆయన తదుపరి రాజకీయ అడుగు కాంగ్రెస్ వైపే ఉంటుందా అనే ఆసక్తి నెలకొంది. వాఘేలా కుమారుడు మహేంద్రసింహ్ వాఘేలా ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరారు. ప్రస్తుతం వాఘేలా పునరాగమనంపై కాంగ్రెస్ అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ముఖ్యంగా రాహుల్‌గాంధీతో వాఘేలా భేటీ తర్వాతే చేరికపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ఫ్రాన్స్‌లో జెన్ ఆల్ఫా నిరసనలు..
స్కూళ్ల సమస్యలపై విద్యార్థుల ఉద్యమం

-మెరుగైన పాఠశాల సదుపాయాల కోసం విద్యార్థుల ఆందోళన
-టైమ్‌టేబుల్‌పై విద్యార్థుల అభ్యంతరాలు
-తరగతుల్లో విద్యార్థుల సంఖ్య తగ్గించాలని డిమాండ్
-టీచర్ల కొరతపై నిరసన
-ఉక్కపోత తరగతి గదులపై ఆగ్రహం
-పారిస్ నుంచి దేశవ్యాప్తంగా విస్తరించిన ఆందోళనలు
-400 స్కూళ్లపై నిరసనల ప్రభావం
-440 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



పారిస్:- (వార్త సంధ్య)అక్టోబర్. 1 : పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఫ్రాన్స్‌లో విద్యార్థులు చేపట్టిన నిరసనలు తీవ్ర రూపం దాల్చాయి. మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యార్థులు పెద్దఎత్తున ఆందోళనలకు దిగారు. కొన్ని చోట్ల చెత్త బుట్టలకు నిప్పు పెట్టడంతో పాటు పోలీసులపైకి వస్తువులు విసిరారు. దీంతో పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు పోలీసులు బాష్పవాయువును ప్రయోగించారు. పాఠశాలల్లో నెలకొన్న పలు సమస్యలపై విద్యార్థులు వారం రోజులుగా నిరసనలు చేస్తున్నారు. పాఠశాలల టైమ్‌టేబుల్, ఒక్కో తరగతిలో ఉండాల్సిన విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల కొరత, ఉక్కపోతగా ఉండే తరగతి గదులు వంటి అంశాలను వారు ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. మెరుగైన విద్యా వాతావరణం, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. తొలుత పారిస్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రారంభమైన ఈ ఆందోళనలు క్రమంగా దేశంలోని ఇతర నగరాలకు విస్తరించాయి. దేశవ్యాప్తంగా సుమారు మూడు లక్షల మంది నిరసన కవాతుల్లో పాల్గొన్నారని విద్యార్థి సంఘాలు తెలిపాయి. పాఠశాలల్లో తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'నగర శివార్లకు చెందిన మేము నిర్లక్ష్యానికి, విస్మరణకు గురయ్యాం. ఇక్కడ పరిస్థితులు అపరిశుభ్రంగా ఉన్నాయి' అని విక్టోయిర్ అనే 16 ఏళ్ల విద్యార్థిని పేర్కొంది. పాఠశాలల్లో కనీస సదుపాయాలు కూడా సక్రమంగా లేవని ఆమె ఆరోపించింది. మరోవైపు విద్యార్థుల నిరసనల ప్రభావంతో దేశవ్యాప్తంగా సుమారు 400 పాఠశాలలు ప్రభావితమైనట్లు ఫ్రాన్స్ విద్యాశాఖ వెల్లడించింది. ఆందోళనల సందర్భంగా 440 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఆ దేశ హోం మంత్రి లారెంట్ తెలిపారు. నిరసనలు కొనసాగుతున్న నేపథ్యంలో పాఠశాలల సమస్యలపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది.

బ్లూ డ్రమ్ తరహాలో మరో ఘటన..

వృద్ధ మహిళను చంపి డ్రమ్ములో దాచిన దంపతులు



న్యూఢిల్లీ (వార్త సంధ్య)అక్టోబర్. 1 : యూపీ, మీరట్ బ్లూ డ్రమ్ తరహాలో ఒక వృద్ధురాలిని చంపి డ్రమ్ములో సిమెంట్‌తో పూడ్చిపెట్టారు దంపతులు. ఈ ఘటన జరిగి నాలుగేళ్లవుతోంది. ఈ ఘటన గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగింది. అంతేకాదు.. ఈ దంపతులు మరో ఇద్దరు మహిళల్ని కూడా హతమార్చారు. హత్యకు గురైన ముగ్గురూ వారి కుటుంబ సభ్యులే. 2022లో ఈ ఘటన జరిగింది. మాధవ్ దాస్, ఊర్మిళ దంపతులు ఈ హత్యలకు పాల్పడ్డారు. మృతుల్లో ఒకరు ఊర్మిళ నానమ్మ శాంతాబెన్ వాసవ. రెండో మహిళ ఊర్మిళ సోదరి భగవతి వాసవ. మూడో మహిళ మాధవ్‌దాస్ తల్లి మంజులాబెన్ సాధు.ముగ్గురినీ ఊపిరాడకుండా చేసి చంపారు. మొదట శాంతాబెన్ వాసవ అనే 70 ఏళ్ల వృద్ధురాలిని ఊపిరాడకుండా చేసి, ఇంట్లోనే హతమార్చారు. అనంతరం ఆమె మృతదేహాన్ని ఒక పెద్ద డ్రమ్ములో ఉంచారు. పైనుంచి సిమెంటు పోసి, పూడ్చేశారు. తర్వాత ఇంటి వెనుక పెరటిలో గొయ్యి తీసి, ఆ డ్రమ్మును పాటిపెట్టారు. ఈ హత్య 2022లో చేశారు. ఆ సమయంలో కోవిడ్ ఉధృతంగా ఉంది. శాంతాబెన్ ఏమైందని బంధువులు, చుట్టుపక్కల వాళ్లు అడిగితే.. కోవిడ్ కారణంగా మరణించిందని, దీంతో ఆస్పత్రి నుంచి నేరుగా తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించామని చెప్పారు. ఆ తర్వాత కొంతకాలానికి భగవతిని, మంజులాబెన్‌ను కూడా వరుసగా ఈ దంపతులు హత్య చేశారు. అయితే, కొంతకాలానికి ఈ హత్యలకు పాల్పడ్డ మాధవ్‌దాస్-ఊర్మిళ దంపతులు విబేధాల కారణంగా విడిపోయారు. ఊర్మిళ ఇంటి నుంచి వెళ్లేటప్పుడు కొడుకుతోపాటు నగలు, డబ్బు వంటివి కూడా పట్టుకెళ్లింది. దీంతో భర్త మాధవ్‌దాస్ ఆమెపై పగతో రగిలిపోయాడు. భార్యపై ఎలాగైనా పగ తీర్చుకోవాలి అనుకున్నాడు. ఇందుకు తాము చేసిన హత్యలను వినియోగించుకోవాలని నిర్ణయించాడు. ఒక హత్యను భార్య చేసినట్లుగా ఫిర్యాదు చేశాడు. తన తల్లి మంజులాబెన్‌ను భార్య ఊర్మిళ, ఆమె సోదరుడు అష్టల్ కలిసి హత్య చేసినట్లు అహ్మదాబాద్ పోలీసులకు మాధవ్‌దాస్ ఫిర్యాదు చేశాడు.దీనిపై విచారణ జరుపుతున్న క్రమంలో మాధవ్ దాస్ చెబుతున్నదాంట్లో అనేక తప్పులు కనిపించాయి. దీంతో అనుమానం వచ్చిన పోలీసులు తమదైన శైలిలో ఆరాతీయగా.. తన తల్లిని భార్యతో కలిసి తానే హత్య చేసినట్లు ఒప్పుకొన్నాడు. దీంతో ఈ ఒక్క హత్యపై విచారణ జరుపుతుండగా.. మిగతా రెండు హత్యల గురించి కూడా తెలిసింది. 2022లో ఈ హత్యలు జరగగా నాలుగేళ్ల తర్వాత ఈ ఘటన బయటపడింది. అది కూడా భర్త మాధవ్‌దాస్ చేసిన పొరపాటు, అతి తెలివి వల్లే.

మహారాష్ట్రలో విషాదం..

బీచ్‌లో మునిగి ఎనిమిది మంది కాలేజీ విద్యార్థులు మృతి



న్యూఢిల్లీ- (వార్త సంధ్య)అక్టోబర్. 1 : మహారాష్ట్రలో ఘోర విషాదం జరిగింది. సరదాగా బీచ్‌కు పిక్నిక్ వెళ్లిన ఎనిమిది మంది విద్యార్థులు సముద్రంలో గల్లంతయ్యారు. వారి మృతదేహాలను అధికారులు వెలికితీశారు. ఈ ఘటన మహారాష్ట్ర, రాయ్‌గఢ్ జిల్లాలోని దివేగర్ బీచ్‌లో గురువారం సాయంత్రం జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలివి. పూనే జిల్లాలోని అలాండిలోని ఒక ప్రైవేటు కోచింగ్ సెంటర్‌కు చెందిన కొందరు 11, 12 తరగతుల విద్యార్థులు రాయ్‌గఢ్ శ్రీవర్ధన్ తాలూకాలోని దివేగర్ బీచ్‌కు పిక్నిక్‌కు వచ్చారు.ఇది స్థానికంగా చాలా ప్రముఖమైన పర్యాటక కేంద్రం. మొత్తం 48 మంది విద్యార్థులు ఈ బీచ్‌కు వచ్చారు. వీరిలో 25 మంది అబ్బాయిలు, 17 మంది అమ్మాయిలు, ఆరుగురు టీచర్లు ఉన్నారు. బీచ్‌కు వచ్చిన తర్వాత సముద్ర జలాల్లో ఆడుకునేందుకు కొందరు విద్యార్థులు నీళ్లలోకి వెళ్లారు. ఈ క్రమంలో నీటి లోతును, అలలను అంచనా వేయలేకపోవడంతో ఆ నీటిలోనే కొట్టుకుపోయారు. ఎనిమిది మంది విద్యార్థులు మునిగిపోవడంతో టీచర్లు, తోటి విద్యార్థులు వెంటనే స్థానికులు, రెస్క్యూ బృందాలను అలర్ట్ చేశారు. వారు వేగంగా స్పందించి రంగంలోకి దిగారు. అక్కడే ఉన్న మహాకాళి వాటర్ స్పోర్ట్స్ ఎంప్లాయిస్, టూరిస్టులు, స్థానికులు కలిసి గల్లంతైన వారి కోసం గాలించారు. ఈ క్రమంలో ఎనిమిది మంది మృతదేహాలను గుర్తించి, వెలికి తీశారు. మృతదేహాల్ని బొర్లి పంచతన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. సముద్రంపై వారికి అవగాహన లేకపోవడం, లోతును, అలలను అంచనా వేయలేకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. ఈ ప్రమాదంపై మహారాష్ట్ర మంత్రి నితీష్ రానే సంతాపం వ్యక్తం చేశారు.

వార్తసంధ్య
www.vaarthasandhya.com

ఓటీటీలోకి వచ్చేసిన కార్తీ 'సర్దార్ 2'

కార్తీ స్పై యాక్షన్ థ్రిల్లర్ 'సర్దార్' చిత్రానికి సీక్వెల్‌గా వచ్చిన 'సర్దార్ 2' ఎట్టకేలకు డిజిటల్ మాధ్యమంలోకి అడుగుపెట్టింది. ఎలాంటి ముందస్తు ప్రకటన లేకుండానే ఈ సినిమా ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియో లో అధికారికంగా స్ట్రీమింగ్ అవుతోంది. మొదటి భాగం బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించడంతో, ఈ రెండవ భాగంపై సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈ సినిమా విడుదలై నెగిటివ్ టాక్ తెచ్చుకుని బాక్సాఫీస్ వద్ద భారీ పరాజయాన్ని అందుకుంది. ఇక దర్శకుడు పి.ఎస్. మిత్రన్ తెరకెక్కించిన ఈ చిత్రంలో హీరో కార్తీ మరోసారి ద్విపాత్రాభినయంతో అదరగొట్టారు.ఇక ఈ చిత్రంలో విలక్షణ నటుడు ఎస్.జె. సూర్య పవర్‌ఫుల్ పాత్రలో కనిపించగా, మాళవిక మోహనన్ , ఆషికా రంగనాథ్ , రజీషా విజయన్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రం ప్రస్తుతం తమిళంతో పాటు తెలుగు, హిందీ, మలయాళం కన్నడ భాషల్లో అందుబాటులోకి వచ్చింది.



రెండు పార్టులుగా అల్లు అర్జున్ 'రాకా'?

పాన్-ఇండియా స్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న మోస్ట్ యాంటిసిపేటెడ్ ప్రాజెక్ట్ 'రాకా' చుట్టూ ప్రస్తుతం టాలీవుడ్ వర్గాల్లో భారీ చర్చ నడుస్తోంది. మాస్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న ఈ భారీ బడ్జెట్ సైన్స్ ఫిక్షన్, యాక్షన్ థ్రిల్లర్‌ను ఒకే పార్టుగా కాకుండా ఏకంగా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ తీవ్రంగా ఆలోచిస్తున్నట్లు సమాచారం.ఈ సినిమాకు సంబంధించిన కథా పరిధి ఊహకందనంత పెద్దదిగా ఉండటంతో పాటు, విభిన్న టైమ్‌లైన్స్ మరియు మల్టిపుల్ గెటప్స్‌తో కూడిన ఒక గ్లోబల్ వరల్డ్‌ను ఈ చిత్రంలో డైరెక్టర్ ఆవిష్కరిస్తున్నట్లు తెలుస్తోంది. స్క్రిప్ట్ డిమాండ్ చేస్తున్న విశాలమైన నేపథ్యానికి పూర్తి న్యాయం చేయాలంటే, ఈ ప్రాజెక్ట్‌ను రెండు భాగాలుగా విభజించడమే సరైన మార్గమని చిత్ర యూనిట్ భావిస్తోందట. ఒకవేళ ఈ ప్లాన్ కనుక పక్కా అయితే, ఈ విజువల్ వండర్ మూవీకి సంబంధించిన మొదటి పార్ట్ డిసెంబర్ 2027లో విడుదలయ్యే అవకాశం ఉందని, రెండో పార్ట్ 2028లో థియేటర్లలోకి వస్తుందని ఇండస్ట్రీ వర్గాలు అంటున్నాయి. అయితే దీనిపై సన్ పిక్చర్స్ నిర్మాణ సంస్థ నుండి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.





యామి గౌతమ్ 'నైయ్ నవెల్లి' ట్రైలర్ విడుదల..

-నవ్వులు పంచుతూనే వెన్నులో వణుకు పుట్టిస్తున్న హర్రర్-కామెడీ!

బాలీవుడ్ నుంచి రాబోతున్న తాజా హర్రర్-కామెడీ 'నైయ్ నవెల్లి' . తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. బాలీవుడ్ హీరోయిన్ యామి గౌతమ్ ధర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి బాలాజీ మోహన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఉత్తర ప్రదేశ్‌లోని మీరట్ నేపథ్యంలో సాగే ఈ సినిమా ప్రేక్షకులను ఎంతగానో అలరించనుంది. ఇక ఈ సినిమా ట్రైలర్ విడుదలైనప్పటి నుంచి సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతూ, సినీ వర్గాల్లో భారీ అంచనాలను క్రియేట్ చేస్తోంది.ఈ చిత్రంలో యామి గౌతమ్ సరసన ఆదినాథ్ కోఠారే తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు-నిర్మాత ఆనంద్ ఎల్ రాయ్ , హిమాన్షు శర్మ సంయుక్తంగా కలర్ ఎల్లో ప్రొడక్షన్స్ మరియు అమెజాన్ ఎంజిఎం స్టూడియోస్ పతాకాలపై ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. మరోవైపు, ఈ సినిమాకు టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ జి.వి. ప్రకాష్ కుమార్ అందిస్తున్న సంగీతం చిత్రానికి అదనపు ఆకర్షణగా నిలవనుంది. ఇక ట్రైలర్ విషయానికి వస్తే.. ఎంతో అస్తవ్యస్తంగా, గందరగోళంగా ఉన్న ఒక సాధారణ కుటుంబంలోకి యామి గౌతమ్ కొత్త కోడలిగా ప్రవేశించడంతో కథ అసలు మలుపు తిరుగుతుంది. ఆమె ఇంట్లోకి అడుగుపెట్టిన తర్వాత ఆ కుటుంబంలోని అందరి జీవితాల్లో అనూహ్య మార్పులు వచ్చి, ప్రశాంతత చేకూరుతుంది. అయితే, ఆ ఇంట్లోని మరిది పాత్రలో నటిస్తున్న ఆదినాథ్‌కు ఆ కొత్త కోడలు ప్రవర్తన మరియు ఆమె పద్ధతుల మీద అనుమానం కలుగుతుంది. అందంగా, అమాయకంగా కనిపిస్తున్న ఆ కోడలు నిజంగానే ఆ కుటుంబానికి దేవతలాంటి మనిషా లేక ఆమె వెనుక మరేదైనా దెయ్యం లేదా అంతుచిక్కని రహస్యం దాగుందా అనే కోణంలో ఈ ట్రైలర్ చాలా ఉత్కంఠభరితంగా, నవ్వులు పూయిస్తూనే వెన్నులో వణుకు పుట్టించేలా సాగుతుంది. హర్రర్ మరియు కామెడీని చాలా చక్కగా మిక్స్ చేసి తెరకెక్కించిన ఈ చిత్రం ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని పంచడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ సినిమాను దసరా కానుకగా అక్టోబర్ 16వ తేదీన ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఘనంగా విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.



ముంబైకి మకాం మార్చిన కల్యాణి ప్రియదర్శన్

దక్షిణాదిలో ప్రతిభావంతురాలైన నాయికగా గుర్తింపును సంపాదించుకుంది కల్యాణి ప్రియదర్శన్. ముఖ్యంగా గత ఏడాది విడుదలైన 'లోక చాప్టర్-1' చిత్రం ఆమె కెరీర్‌ను మలుపుతిప్పింది. ఈ నేపథ్యంలో ఆమె 'ప్రళయ్' సినిమాతో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నది. రణ్‌వీర్‌సింగ్ కథానాయకుడిగా జై మెహతా దర్శకత్వంలో జాంబీ థ్రిల్లర్‌గా ఈ సినిమా తెరకెక్కనుంది. బాలీవుడ్‌లో అరంగేట్రం చేస్తూనే రణ్‌వీర్‌సింగ్ సరసన నటించే లక్కీఛాన్స్‌ను దక్కించుకోవడంతో ఈ సొగసరి ఆనందానికి అవధులులేకుండా పోయాయి.ఈ నేపథ్యంలో ఈ సినిమా కోసం ఆమె లుక్, ఫిట్‌నెస్, యాక్షన్ స్కిల్స్‌పై ప్రత్యేకంగా దృష్టిపెడుతున్నది. అందులో భాగంగా ముంబయికి మకాం మార్చి సినిమా పూర్తయ్యే వరకు అక్కడే ఉండాలని నిర్ణయించుకుందట. ముఖ్యంగా యాక్షన్ ఘట్టాల కోసం గత మూడు నెలలుగా స్పెషల్ ట్రెయినింగ్ తీసుకుంటున్నదట. రణ్‌వీర్‌సింగ్‌తో కలిసి వర్క్‌షాప్స్, రిహార్సల్స్‌లో పాల్గొంటూ బిజీగా గడుపుతున్నదీ భామ. ఈ సినిమా ద్వారా బాలీవుడ్‌లో బ్రేక్ సాధించి ఉత్తరాదిన కూడా తన ఇమేజ్‌ను పెంచుకోవాలనే లక్ష్యంతో కల్యాణి ప్రియదర్శన్ ఉందని చెబుతున్నారు. 'ప్రళయ్' చిత్రం అక్టోబర్‌లో సెట్స్‌మీదకు వెళ్లనుంది.

రానా సమర్పణలో కార్తీక్ సుబ్బరాజు గే లవ్‌స్టోరీ 'డోరతీ'

-తెలుగు ట్రైలర్ రిలీజ్



కోలీవుడ్ ప్రముఖ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో తెరకెక్కిన సరికొత్త బోల్డ్ అండ్ ఎమోషనల్ డ్రామా చిత్రం 'డోరతీ' . ఆస్కార్ అవార్డు విజేత గునీత్ మోంగా నిర్మించిన ఈ చిత్రంలో కీర్తి సురేష్ టైటిల్ రోల్ పోషించగా, సనంత్, రిషికాంత్ కీలక పాత్రల్లో నటించారు. ఇటీవలే తమిళ ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం తాజాగా తెలుగులోకి రాబోతుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్.ప్రముఖ నటుడు రానా దగ్గుబాటికి చెందిన 'స్పిరిట్ మీడియా' సంస్థ ఈ చిత్రాన్ని అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. 1990ల నాటి నేపథ్యంలో సాగే ఈ కథలో సమాజంలోని పక్షపాతాలు, లింగ సమానత్వం, LGBTQIA+ మరియు జెండర్ రాజకీయాల చుట్టూ తిరిగే విభిన్నమైన, ధైర్యమైన కథాంశాన్ని కార్తీక్ సుబ్బరాజు ఆవిష్కరించారు. టొరంటో అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శితమై ప్రశంసలు పొందిన ఈ చిత్రానికి మ్యూజిక్ మాస్ట్రో ఇళయరాజా సంగీతం అందించడం విశేషం.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.